



# భారతమిత్రం

తెలుగు పక్షపత్రిక

సంపుటి : 03 | సంచిక : 10

మే 16-31, 2021 | రూ.13/-

"నేను కూడ క్రీస్తు కోసమే జీవిస్తాను.
ఆయన కోసమే
ఆయన సేవలోనే మరణిస్తాను"

- పునీత లొయోలాపురి ఇన్యాశివారు

## పునీత లొయోలాపురి ఇన్యాశివారి పరివర్తన పంచశత వార్షికోత్సవం

(20 మే 1521 - 31 జూలై 2022)

(ప్రత్యేక వ్యాసం 13వ పేజీలో...)

# పునీత అగస్తీను గారి సభ

## (Order of St. Augustine)






"ఓ ప్రభువా నీవు మమ్ములను నీ కొరకు సృష్టించితివి. నీలో విశ్రాంతి పొందువరకు మా ఆత్మ విశ్రమించదు" అని పలికిన పునీత అగస్తీను గారి సభలో ఆదిమ క్రైస్తవ సంఘం ప్రేరణలో ఒకే మనస్సుతో, ఒకే హృదయముతో (అ.కా. 4:32-35) జీవించుచున్న మీ జీవితాలను దేవుని సేవకై మరియు దైవ ప్రజల సేవయందు సమర్పించుటకు సిద్ధపడి జీవవాక్కుచే పవిత్రపరిచి, దేవుని ప్రేమాగ్నితో జ్వలించబడి క్రీస్తుని సాక్షులుగా తయారుచేయుటయే పునీత అగస్తీను గారి సభ ముఖ్య లక్ష్యం. ఈ సభకు ఆకర్షితులై అనేక మంది యువకులు క్రైస్తవ సన్యాసులుగా క్రీస్తుని అనుసరిస్తున్నారు మరియు ప్రపంచ నలుమూలల 58 పైగా దేశాలలో సువార్త సేవను అందిస్తున్నారు.


**ప్రియమైన యువకులారా! నీ హృదయంలో విశ్రాంతి లేదా? అయితే పునీత అగస్తీను గారి సన్యాస సభలో చేరి ఒక గురువుగా లేదా బ్రదరుగా దేవుని సేవకై మరియు పొరుగువారి సేవ చేయటానికై సిద్ధంగా వున్నావా? మీలో ప్రేరణ కలిగినట్లయితే పునీత అగస్తీను గారి సభలో చేరటానికి అర్హతలు 10వ తరగతి,ఇంటర్ (+2) లేదా డిగ్రీ చదువులలో ఉత్తీర్ణులైన కతోలిక యువకులను హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాము.**

సంప్రదించండి :

**రెవ. ఫా॥ గాబ్రియేలు** OSA, ఒకేషన్ ప్రమోటర్

**సెల్: 6300450322, 7036583226,** అగస్టీనియన్ ఫాదర్స్, ఎంజాల, హైదరాబాద్, తెలంగాణ - 501510

# హృదయవిదారకం కరోనా విలయతాండవం



ఫాదర్ కస్పార్
సెల్ : 9573879171

ఒకటి రెండు మూడు ఇదేదో పాటకు పల్లవి కాదు. కరోనా మనల్ని కుళ్లబొడవడానికి వేస్తున్న గంతులు

పెంపుడు జంతువులు మరణిస్తేనే కన్నీళ్లు పెడతామే.. కళ్ళముందే అయినవాళ్లు రాలిపోతుంటే కన్నీళ్లకు కూడా అంటు తగిలింది

సోషల్ మీడియాలో విని కరోనా రాదని ముక్కులో నిమ్మరసం పిండుకొని వెంటనే పోయాడట ఒకరు. ఇలాంటివి నమ్మకుండా వాక్సిన్ తీసుకోండి

గురువైనా బరువే అంటూ అందరి వెంటబడి తరుముతున్న కరోనాపై ఎదురుదాడికి దిగాలి. ప్రతి ఇల్లు వైద్యశాల ప్రతి వ్యక్తి వైద్యుడు కావాలిహృదయవిదారకం కరోనా విలయతాండవం

కరోనా ఉద్ధృతి కొనసాగుతోంది. లక్షల్లో కేసులు, వేలల్లో మరణాలు నమోదౌతున్నాయి. త్వరలో మరణాల రేటు రెట్టింపు అవుతుందంటున్నారు. ఇప్పుడున్న సెకెండ్ వేవ్ లోనే పరిస్థితులు ఇంత భయానకంగా ఉంటే, త్వరలోనే భారత్ లో థర్డ్ వేవ్ వస్తుందని ప్రధానమంత్రి వైజ్ఞానిక సలహాదారు వెల్లడించడం గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ప్రస్తుత పరిస్థితి చూస్తేనే, ఆసుపత్రుల్లో సరిపడా పడకలు, ఆక్సిజన్ అందుబాటులో లేక నిస్సహాయంగా నిత్యం వందల సంఖ్యలో కరోనా బాధితులు మృత్యువాత పడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఇక మరణాలు రెట్టింపైతే పరిస్థితి ఏంటి? ఆగస్టు చివరికి దేశ వ్యాప్తంగా మరణాల సంఖ్య 3,29,000కు చేరుకుంటుందని విశ్లేషకుల అంచనా. రక్తసంబంధులు, తెలిసినవాళ్ళు కళ్ళ ముందే కొనఊపిరితో కొట్టుకుంటూ తుది శ్వాస విడుస్తుంటే, ఓదార్చలేని, చేయిచాచి తాకలేని, కనీసం పరామర్శించలేని కడుదీన పరిస్థితి. ఇది ఆలోచనలకు అందని గుండెల్ని పిండేసే ఘోరకలి. ఇక ప్రత్యక్షంగా అనుభవించినవారి మనోవేదన వర్ణనాతీతమే కదా.. ఇటువంటి స్థితిలో మన వంతు వస్తుందేమోనన్న భయం వెంటాడక మానదు కదా.

ఈ మహమ్మారి ఎవరికీ అతీతం కాదు కాబట్టి మన తెలుగు పీఠాలలో అనేక మంది గురువులు కూడా కరోనా బారినపడి మరణిస్తున్న విషయం ఆయా సమాచారాల ద్వారా వింటూనే ఉన్నాం. చనిపోయిన గురువులకు సరైన రీతిలో దివ్య బలిపూజ సమర్పించి భూస్థాపితం చేయలేని దీనహీన స్థితి. ఈ విపత్తు చూస్తుంటే భవిష్యత్తులో బతికి బట్టకడతామా అనే అనుమానం రాకపోదు. భయపడి చేసేది ఏమీలేదు. ఈ పరిస్థితుల్లో ఏ నోటవిన్నా దేవుడే కాపాడాలి అనే మాటే వినబడుతోంది. నిజం చెప్పాలంటే దేవుడే కాపాడాలి. కావున విశ్వాసంతో, ఆశతో, ఎడతెగని ప్రార్థనా విన్నపాలతో ముందుకు సాగుదాం. మన కొరకు రక్తం చిందించి మృత్యుంజయుడై, దేవుని కుడి ప్రక్కన సింహాసనాసీనుడైన, మన ప్రధాన యాజకుడు క్రీస్తు "సానుభూతి చూపలేని వ్యక్తి కాదు" (హెబ్రీ 4:14-16) అను వాక్యాన్ని విశ్వసించి, మరణగంటలు మ్రోగిస్తున్న మహమ్మారి నుండి త్వరగా విడుదలను ప్రసాదించమని వేడుకుందాం. నీ విశ్వాసం బలమైనదైతే తప్పకుండా దేవుని కృప దొరుకుతుంది.

దైవకృప, శాస్త్రవేత్తల కృషితో కరోనాకు టీకా అందుబాటులోకి వచ్చింది. కరోనా టీకాపై కొన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, టీకా వేయించుకోవటం వలన ఎంతో ప్రయోజనం ఉంటుందని వైద్య నిపుణులు అంటున్నారు. రెండు మూడు రకాల టీకాలు అందుబాటులోకి వచ్చాయి కాబట్టి ఏ టీకా అందుబాటులో ఉంటే ఆ టీకా వేయించు కోవడం మంచిది. వాని పనితీరు వలన శరీరంలో రక్షణ వ్యవస్థ బలపడుతుంది. వైరస్ బారినుండి కాపాడుతుంది. వ్యాక్సిన్ తీసుకున్నప్పటికీ కరోనా జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి అని గుర్తుంచుకోవాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం దీన్ని వెల్లడి చేసింది. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకుంటే ఏం లాభం? కాబట్టి ఇరుగుపొరుగు వారు తెలిసీతెలియక చెప్పిన మాటలు, సోషల్ మీడియాలో అది చేయండి ఇది చేయండి అంటూ వస్తున్న కథనాలను పాటించి ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దు. వాక్సిన్ పై ఉన్న అపోహలు ప్రక్కన పెట్టండి. దేవుని పై భారం వేయండి. తక్షణ కర్తవ్యంగా ప్రాథమిక జాగ్రత్తలు పాటిస్తూ, కరోనా వ్యాప్తిని, మరణ తీవ్రతను వీలైనంతగా తగ్గించుకుందాం. మరొక విషయం ఈ జబ్బు బారిన పడి వైద్యశాలలకు వెళితే పెద్ద ప్రయోజనం కనిపించని విషయం చూస్తున్నాం. వెళ్ళినా బెడ్స్ లేవు. బెడ్స్ ఉన్నా ఆక్సిజన్ లేదు అనే విషయం అనేక మంది బాధితుల నుండి వింటున్నాం. అన్నీ ఉన్నా వైద్యులు కనిపించటం లేదు. థర్డ్ వేవ్ పరిస్థితులు ఎలా ఉంటాయో ఊహించలేము. కాబట్టి ప్రత్యామ్నయం ఆలోచించాలి. జబ్బు పడిన మన వారికి మనమే వైద్యం అందించాల్సిన పరిస్థితులు తప్పవని పిస్తుంది. ఆరంభంలోనే ఇంటి వైద్యం అందితే ప్రమాదం తప్పుతుందని అంటున్నారు. ఈ జబ్బుకు ప్రాథమికదశలో వైద్యం ఎలా చేయాలో ఇప్పుడు దాదాపుగా అందరికీ తెలిసింది. అందుకు అందరం సిద్ధపడక తప్పదు.

ఐతే ఈ కరోన విపత్తు నేర్పించిన సంగతులు చాలా కాలం మనకు గుర్తుండిపోతాయి. ఇప్పటివరకు కనీవినీ ఎరుగని సంగతులు. ఈ విపత్తులో బ్రతికి బట్టకట్టామంటే దేవుని కనికరంగానే పరిగణించాలి. ఇశ్రాయేలు ప్రజలు ఐగుప్తు దేశంలో ఉన్నపుడు, అనేక అరిష్టాలు వచ్చినపుడు వాటన్నింటి నుండి దేవుడు కాపాడిన వైనాన్ని వారి పిల్లలకు కథల రూపంలో, పాటల రూపంలో చెప్పారు. కృతజ్ఞతలు చెల్లించే గొప్ప సంగతులుగా వాటన్నిటిని గ్రంథస్థం చేసి, వారి దైవార్చనలో నెమరు వేశారు . కరోనా విపత్తు కూడా అదేవిధంగా చరిత్రలో నిలబడుతుంది. అందరి నోట విన్పించే దేవుడే కాపాడాలన్న మాట నమ్ముతూ, వైద్యశాలలో సదుపాయాలు అందుబాటులో లేకపోతే ధైర్యంగా మనమే వైద్యంచేసి మన వారిని కాపాడుకున్నామన్న విషయాలు మన తరువాత తరం వారు విజయగాథలుగా చెపుకునే విధంగా చరిత్రలో మిగులుదాం.

సంపుటి : 03 సంచిక : 10





ఎడిటర్ - పబ్లిషర్:

**ఫాదర్ కస్పార్ చాట్ల**

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్:

**శ్రీ యాదాల రత్నతేజ**

సంపాదకవర్గం:

**ఫాదర్ ఐజక్ సూరేపల్లి**

**ఫాదర్ సగిలి ప్రకాశ్**

**ఫాదర్ మాదాను ఫ్రాన్సిస్**

**డా॥ గుత్తం ప్రతాపరెడ్డి**

**సిస్టర్ లలిత**, జె.యం.జె

అడ్వర్‌టైజింగ్ & మార్కెటింగ్ మేనేజర్

**శ్రీమతి సి. విజయానంద**

07981417618, 09390504455

vijayanandac@yahoo.com

డిజైనింగ్:

**కె. లింగస్వామి**

చందా వివరాలు/ఫిర్యాదులకు:

**కిరణ్, 9581904143**

**కరణ్, 9346369834**

**సందీప్, 7207399373, 8074821640**

Owned, Published & Printed by:
BHARATA MITRAM
Off. Ph : 9390504455
editorbm70@gmail.com,
frkasparchatla@gmail.com
website : www.bharathamithram.com

**భారతమిత్రం చందా వివరాలు**

సాలు చందా రూ. 300/-లు యం.ఓ., డి.డి.ల ద్వారా
"భారతమిత్రం" పేరున పంపాలి.
చెక్కులు పంపేవారు బ్యాంకు కమీషను రూ. 15/-లు జతపరచాలి.
మీ చందా "భారతమిత్రం" పేరున తప్ప వ్యక్తుల పేరున పంపరాదు.


THE EDITOR - BHARATA MITRAM
TCBC Secretariat, 2/3, Sikh Village,
Secunderabad, Hyderbad - 09, Telangana

Printed at :
Jeevan Institute, Sikh Village, Sec-bad


# విషయ సూచిక...


01. సంపాదకీయం ...03
02. సహజ రక్షణ వ్యవస్థకు అదనపు రక్షణ ...05
03. ఆత్మ దర్శనం ...07
04. జీవవైవిధ్యమే జీవన వేదం ...08
05. నిత్యం పవిత్రపరిచే పవిత్రాత్మ... ...09
06. త్రిత్వం విశ్వాస సత్యం ...11
07. పంచశత వార్షిక ఉత్సవం ...13
08. భారత చెరసాల పరిచర్య ...17
09. పవిత్ర వివాహం - కుటుంబ జీవితం ...18
11. పరిచర్య సేవ అందరి బాధ్యత ...21
12. పాదాభిషేకం ...23
13. రక్షణ ప్రణాళికలో వాళ్ళిద్దరూ కలిసారు ...24
14. ఉదయ సప్తకం - ప్రాంజలి ...26


# స్పందన



**అద్భుతమైన అంశాలతో వ్యాసాలు - బిషప్ పొలిమేర జయరావు**

భారతమిత్రం సంపాదకులకు, ఇటీవల భారతమిత్రంలో ప్రచురిస్తున్న వ్యాసాలన్నీ చాల బాగుంటున్నాయి. మే మొదటి సంచికను చూసాను. సమయాభావంవల్ల వ్యాసం తరువాత వ్యాసం చదవలేదు. నేను అవన్నీ తరువాత చదువుతాను. అన్నీ కూడా ముఖ్యమైన విషయాలను బోధిస్తున్నాయని మాత్రం చెప్పగలను. చక్కని వ్యాసాలను ప్రచురించడంలో మీరు, మీ సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయం. వ్యాసకర్తలందరికి అభినందనలు. పత్రికలో చొరవగా వ్యాసాలు రాయడానికి ముందుకొస్తున్న గురువులు, మఠకన్యలు అభినందనీయులు. ఇలాగే మున్ముందు కూడా మంచిమంచి వ్యాసాలతో సామజిక, ఆధ్యాత్మిక చైతన్యం కలిగించడానికి కృషి చేస్తారని ఆశిస్తున్నాను.

---

**కొత్త మలుపు**

గౌరవ సంపాదకులకు నమస్కారం! 2021-మే మొదటి సంచికలో కతోలిక సాహిత్యంలోని పద్యాలు బావున్నాయి "మన మిర్రర్" మన సత్య వేదంలో కనిపించే తొలి తాత్విక భావం కవిత్వంలో అందించారు (52, 53, 54 పద్యాలు) మన బాల్యదశలోని ప్రార్థన అలవాటు (59లో) చక్కగా చెక్కారు. త్యాగానికి కష్టానికీ చిహ్నమైన క్రీస్తును ఆదర్శంగా తీసుకొని జీవించే సంస్కృతి మనది అని (57, 58లలో) చెప్పారు. మనకు పశ్చాత్తాపాన్ని మించిన కొత్త జన్మ మరొకటి లేదని (55లో) మన క్రైస్తవ సంస్కృతిని వివరించడం,చివరి 60వ పద్యం మనకు భంగం కాని ఒక విశాల వినూత్న భావనతో కనిపిస్తోంది. రాజు గారి "ఉదయసప్తకం" కోసం ఎదురు చూస్తున్నాం! ప్రోత్సహిస్తున్న ఫాదర్ గారికి అభినందనలు.

**- శ్రీమతి కే. జ్యోతి శర్మ HM నెల్లూరు, 9441794715**

---

**కతోలిక సంస్కృతిని కవిత్వీకరించడం సవాలే**

నమస్కారం ఫాదర్ గారూ !! మే 2021 మొదటి సంచిక ఆర్టికల్స్ బాగున్నాయి . కార్మిక శక్తిని ఆసాంతం దర్శించి సానుభూతిని ప్రకటించి సంఘటితం కావలనే సూచనలు చేసిన కొండవీటిపాప గారి వ్యాసం బాగుంది. డా. బెర్నార్డ్ రాజు గారి భావనా శక్తి బాగుంది. ఆర్టికల్స్ అమరిక అపూర్వంగా ఉంది. క్రైస్తవ సంస్కృతిని కవిత్వీకరించడం మనకు ముందున్న సవాలు. దానికి సమాధానమే ఈ కవి చేస్తున్న పద్యప్రయోగం అన్నట్టుగా ఉంది. ఏమైనా పద్యం వ్రాయడం, దాన్ని ప్రచురించడం, నేటి పత్రికల్లో చదివించడం ఒక చక్కటి అనుభూతి. ఈ పద్యాలు సాహిత్యానికి పరోక్షంగా అర్థం చెబుతున్నాయి. మన పత్రిక కవన సాహిత్యం వైపు తిరగడం గమనిస్తున్నాం. అందుకే ఎడిటర్ గారికి, కవికీ అభినందనలు!!

**- డా. పరిమళ, లెక్చరర్, సూళ్ళూరు పేట, ఫోను: 9493666541**



ప్రస్తుతం ఎవరి నోట విన్న టీకా అనే మాటే వినిపిస్తుంది. టీకానే రోగనిరోధక సంజీవనిగా చెబుతున్నారు. అయితే కరోనాకి టీకా ఉందికాని, హెచ్ఐవికి లేదు. హెచ్ఐవి సంక్రమణను నివారించే లేదా అది ఉన్నవారికి చికిత్స చేసే టీకా అందుబాటులో లేదు. అయితే, టీకాను అభివృద్ధి చేయడానికి శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. హెచ్ఐవిని నివారించడానికి ఎన్ఐహెచ్ బహుళ విధానాలలో కృషి చేస్తోంది. 1998 సం॥లో హెచ్ఐవిపై క్లింటన్ ప్రసంగం వార్షికోత్సవం సందర్భంగా మే18, 1998న మొదటి ప్రపంచ ఎయిడ్స్ వ్యాక్సిన్ దినోత్సవాన్ని ఆచరించారు. ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. ప్రస్తుతం, హెచ్ఐవికి సురక్షితమైన చికిత్స లేదు. HIV శరీరంలోకి ప్రవేశించిన తర్వాత దాన్ని తొలగించలేము కాని యాంటీరెట్రోవైరల్ థెరపీ (ART)తో రోగనిరోధక వ్యవస్థకు జరిగే నష్టాన్ని నిరోధించవచ్చు.

# సహజ రక్షణ వ్యవస్థకు అదనపు రక్షణ

(ప్రపంచ ఎయిడ్స్ వ్యాక్సిన్ డే: మే 18)

సేకరణ :
**యాదాల రత్న తేజ**
ఎగ్జిక్యూటివ్ ఎడిటర్, భారతమిత్రం
సెల్ : 9542174072



ఎయిడ్స్ వాక్సినేషన్ డే సందర్భంగా ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తున్న మహమ్మారి కోవిడ్-19ను నివారించడానికి భారత్ తో సహా పలు దేశాలు నిరంతర శ్రమ చేసి కోవిడ్ నిరోధించ డానికి వాక్సిన్ అందుబాటులోకి తెచ్చాయి. అయితే వాక్సిన్ తీసుకోవడంలో చాలామంది సందేహపడుతున్నారు. అసలు వాక్సిన్లు, టీకాలు ఎందుకు తయారుచేయబడతాయి, ఎలా పని చేస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం.

**టీకాలు వేయడం అనేది హానికరమైన వ్యాధుల నుండి ప్రజలను రక్షించడానికి ఒక సాధారణ, సురక్షితమైన మరియు ప్రభావవంతమైన మార్గం.** నిర్దిష్ట అంటువ్యాధులకు నిరోధకతను పెంపొం దించడానికి ఇది మన శరీర సహజ రక్షణలను ఉపయోగిస్తుంది. మన రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది.

వ్యాక్సిన్లు మన రోగనిరోధక వ్యవస్థకు, ప్రతి రోధకాలను సృష్టించడానికి శిక్షణ ఇస్తాయి. మామూలుగా ఇది ఒక వ్యాధికి గురైనప్పుడు వైద్యం చేసినట్లే. అయినప్పటికీ టీకాలు, వైరస్లు లేదా బ్యాక్టీరియా వంటి సూక్ష్మక్రిములను చంపు తాయి లేదా బలహీనపరుస్తాయి. మనల్ని వ్యాధి నుండి దూరం చేస్తాయి. అందుచేత అవి వ్యాధికి కారణం కాదు, **మనకు ప్రమాదం కలిగించవు. చాలా టీకాలు ఇంజెక్షన్ ద్వారా ఇవ్వబడతాయి, కొన్ని నోటి ద్వారా ఇవ్వబడతాయి లేదా ముక్కులోకి పిచికారీ చేయబడతాయి.**

వ్యాక్సిన్లు ఇప్పుడు గతంలో కంటే ఎక్కువగా వినియోగంలో ఉన్నాయి. ఈ రోజు కనీసం 20 వ్యాధులు, డిఫ్తీరియా, టెటనస్, పెర్టుస్సిస్, ఇన్ ఫ్లూయెంజా మరియు మీజిల్స్ మొదలైన వాటి నుండి రక్షించడానికి టీకాలు అందుబాటులో ఉన్నాయి. **ఈ టీకాలు మొత్తమ్మీద ప్రతి సంవ త్సరం 3 మిలియన్ల మంది ప్రజల ప్రాణాలను కాపాడతాయి.**

టీకాలు మనల్ని మనం రక్షించడం మాత్రమే కాదు, మన చుట్టూ ఉన్న వారిని కూడా రక్షిస్తాయి. తీవ్రమైన అనారోగ్యంతో ఉన్నవారు కొన్ని టీకాలు తీసుకోకూడదని సలహా ఇస్తారు. కాబట్టి టీకాలు వేయడానికి, వ్యాధి వ్యాప్తిని తగ్గిం చడంలో సహాయపడటానికి మన ఆసక్తిపైనే ఆధారపడి ఉంటుంది.

**టీకాలు మన శరీరం రక్షణ కోసం, సహజ రక్షణతో పనిచేయడం ద్వారా వ్యాధి వచ్చే ప్రమా దాలను తగ్గిస్తాయి. మనం టీకా తీసుకున్నప్పుడు మన రోగనిరోధక శక్తి స్పందిస్తుంది. వ్యాధిని సమర్థవంతంగా ఎదుర్కొంటుంది.**

**ఎలాగంటే:** వైరస్ లేదా బ్యాక్టీరియా వంటి ఆక్రమణ సూక్ష్మక్రిమిని గుర్తిస్తుంది. ప్రతిరోధకా లను ఉత్పత్తి చేస్తుంది. ప్రతిరోధకాలు అంటే వ్యా ధితో పోరాడటానికి రోగనిరోధక వ్యవస్థ ద్వారా సహజంగా ఉత్పత్తి అయ్యే ప్రోటీన్లు. గుర్తించిన వ్యాధితో ఎలా పోరాడాలో గుర్తుచేస్తుంది.

మన రోగనిరోధక వ్యవస్థలు మనల్ని మనం

## టీకా ఎంత ప్రభావవంతంగా ఉంటుంది?

చిన్నతనంలో టీకాలు మనమంతా వేయించుకునే ఉంటాము. చిన్నతనంలోనే ఎందుకు టీకాలు వేస్తారు అంటే వయసు పెరుగుతున్న కొద్దీ ఎలాంటి అంటువ్యాధులు దాడి చేయకుండా ఉండడానికే. 85% నుండి 95% మంది పిల్లలలో టీకా చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఇది మన గొప్ప ప్రపంచ ఆరోగ్య విజయాలలో ఒకటిగా పరిగణించబడుతుంది. సంవత్సరానికి 2-3 మిలియన్ల మంది ప్రాణాలను కాపాడుతుందని అంచనా వేయబడింది. టీకాలకు ధన్యవాదాలు చెప్పాల్సిందే, UKలో చిన్నపిల్లలలో సాధారణంగా కనిపించే ప్రాణాంతక వ్యాధులు, డిఫ్తీరియా, హూపింగ్ దగ్గు మరియు పోలియో వంటివి ఇప్పుడు చాలా అరుదు. చరిత్రను చూస్తే, వ్యాక్సిన్ని ప్రవేశపెట్టిన తరువాత కొన్ని వ్యాధులు కూడా పూర్తిగా నిర్మూలించబడ్డాయి, ఉదాహరణకు మశూచి. మశూచి నిర్మూలించకపోతే, ఇది ప్రపంచవ్యాప్తంగా 5 మిలియన్ల మరణాలకు కారణమయ్యేది!


రక్షించుకోడానికి రూపొందించబడ్డాయి. మనం సాధారణంగా టీకా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ మోతాదులు తీసుకున్న తర్వాత, ఒక వ్యాధి నుండి సంవత్సరాలు, దశాబ్దాలు లేదా జీవితకాలం కూడా రక్షించబడతాము. టీకాలు చాలా ప్రభావవంతంగా ఉంటాయి. **ఏదైనా ఒక వ్యాధి సోకితే అనారోగ్యానికి గురికాకుండా వ్యాక్సిన్లు నిరోధిస్తాయి.** వ్యాక్సిన్లలో ఉపయోగించే అనేక భాగాలు శరీరంలో, వాతావరణంలో మరియు మనం తినే ఆహారాలలో సహజంగా లభించేవే. వ్యాక్సిన్లలోని అన్ని పదార్థాలు – అలాగే టీకాలు కూడా – అవి సురక్షితంగా ఉన్నాయో లేదో నిర్ధారించడానికి పూర్తిగా పరీక్షించబడతాయి మరియు పర్యవేక్షింపబడతాయి.

టీకాలు వేయించుకోవడం సురక్షితం. టీకా వలన కలిగే దుష్ప్రభావాలు చాల సాధారణమైనవి తాత్కాలికమైనవి కూడా. గొంతు నొప్పి, చేయి నొప్పి లేదా తేలికపాటి జ్వరం వంటివి. మరింత తీవ్రమైన దుష్ప్రభావాలు రావచ్చు. కానీ చాల అరుదుగా మాత్రమే సంభవిస్తాయి.

**ఏదైనా లైసెన్స్ పొందిన వ్యాక్సిన్ ఉపయోగం కోసం ఆమోదించబడటానికి ముందే బహుళ దశల ట్రయల్స్‌లో కఠినంగా పరీక్షించబడుతుంది.** ప్రవేశపెట్టిన తర్వాత క్రమం తప్పకుండా తిరిగి అంచనా వేయబడుతుంది. టీకా ఆరోగ్యానికి హాని కలిగించే సంకేతాల కోసం శాస్త్రవేత్తలు నిరంతరం పర్యవేక్షిస్తూ, అనేక వనరుల నుండి సమాచారాన్ని సేకరిస్తుంటారు. గుర్తుంచుకోండి, మనం వ్యాక్సిన్ తీసుకోకపోతే నివారించగల వ్యాధి నుండి మరిన్ని తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది. ఉదాహరణకు, టెటానస్ విపరీతమైన నొప్పి, కండరాల నొప్పులు (లాక్జా) మరియు రక్తం గడ్డకట్టడానికి కారణమవుతుంది, మీజిల్స్ ఎన్సెఫాలిటిస్ (మెదడు ఇన్ఫెక్షన్) మరియు అంధత్వానికి కారణమవుతుంది. **వ్యాక్సిన్ తీసుకోకపోతే నివారించగల అనేక వ్యాధులు మరణానికి దారితీస్తాయి.** టీకా వల్ల కలిగే ప్రయోజనాలు ప్రమాదాలను మించి ఉంటాయి. టీకాలు వేసుకోకుంటే మరెన్నో జబ్బుల ద్వారా మరణాలు సంభవిస్తాయి.

**వ్యాక్సిన్ల వల్ల దుష్ప్రభావాలు ఉన్నాయా?:** ఏదైనా ఔషధం వలె, టీకా వేసుకున్న తర్వాత సాధారణ జ్వరం, ఇంజెక్షన్ వేసిన చోట నొప్పి లేదా ఎరుపెక్కడం వంటి తేలికపాటి దుష్ప్రభావాలను కలిగిస్తాయి. ఈ తేలికపాటి ప్రతిచర్యలు కొద్ది రోజుల్లోనే వాటంతట అవే తగ్గి పోతాయి. కాబట్టి అనుమానించకుండా ప్రతి ఒక్కరు టీకా తీసుకోవడం తప్పనిసరి అనుకోవాలి. మనల్ని మనం రక్షించుకోవాలంటే తక్షణ కర్తవ్యం కోవిడ్–19 వ్యాక్సిన్ తీసుకోవడం, మాస్కు పెట్టుకోవడం, శానిటైజర్ ఉపయోగించడం, భౌతిక దూరాన్ని పాటించడం తప్పక ఆచరించాలి. దగ్గు, జలుబు, జ్వరం ఉంటే ఇంట్లో ఉన్నా కూడా మాస్కు ధరించడం శ్రేయస్కరం.

## కోవిడ్ రోగుల సేవలో కతోలిక యువత



కోవిడ్‌తో సతమతమవతున్న వారికి సాయం అందించేందుకు పలువురు జంకుతున్న నేపథ్యంలో వారికి సాయం చేసేందుకు కతోలిక యువత ముందుకొచ్చింది. బెంగళూరు ఆర్చ్ డయాసిస్ పరిధిలో కతోలిక యువత, కన్యాస్త్రీలు, గురువులు కలసి రోగులకు సేవలు చేసేందుకు నిర్ణయించుకున్నారు. కార్మలైట్ ఫాదర్ల ప్రోత్సాహంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు యూత్ కమీషన్ కార్యదర్శి ఫాదర్ అనిల్ చెప్పారు. 'ఇతరులు మీకేమి చేయవలెనని కోరుదురో.. దాన్నే మీరు ఇతరులకు చేయండి' అన్న క్రీస్తు మాటలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు.

## యాంటీబాడీస్ అంటే ఏమిటి? ఎలా పనిచేస్తాయి?

యాంటీబాడీస్ అని పిలువబడే పెద్ద ప్రోటీన్లను సృష్టించడం ద్వారా మనలోని రోగనిరోధక వ్యవస్థ రోగకారక క్రిములతో పోరాడే మార్గాలలో ఒకటి. ఈ ప్రతిరోధకాలు స్కౌట్స్ వలె పనిచేస్తాయి. అంటువ్యాధి కలిగించే (ఏజెంట్) రోగకారక వైరస్‌ని వేటాడతాయి. రోగనిరోధక వ్యవస్థ ద్వారా దానిని నాశనం చేస్తాయి. ప్రతి యాంటీబాడీ (ప్రతి రక్షణం) అది గుర్తించిన బ్యాక్టీరియా లేదా వైరస్‌కు ప్రత్యేకమైనది. అది నిర్దిష్ట రోగనిరోధక ప్రతిస్పందనను ప్రేరేపిస్తుంది. సంక్రమించిన వ్యాధి పోయిన తర్వాత ఈ నిర్దిష్ట ప్రతిరోధకాలు రోగనిరోధక వ్యవస్థలో ఉండిపోతాయి. అదే వ్యాధి మళ్లీ ఎదురైతే, ఎంతో జ్ఞాపకశక్తి గల మనలోని రోగనిరోధక వ్యవస్థ మనం అనారోగ్యానికి గురికాక ముందే దాన్ని వెంటనే నాశనం చేయడానికి సిద్ధంగా ఉంటుంది. అయితే, కొన్నిసార్లు రోగనిరోధక వ్యవస్థ హానికరమైన బ్యాక్టీరియా లేదా వైరస్‌కు వ్యతిరేకంగా జరిగే ప్రారంభ యుద్ధంలో విజయం సాధించదు. అందువల్ల మనం చాలా అనారోగ్యానికి గురవుతాం లేదా వ్యాధి తీవ్రమైన సందర్భాల్లో చనిపోతాము కూడా. టీకా అనేది మన శరీరానికి ఇంకా సోకని బ్యాక్టీరియా లేదా వైరస్ ను ఎదుర్కొనే రోగనిరోధక శక్తిని పొందడానికి సురక్షితమైన అత్యంత సాధారణ మార్గం. టీకాలు మనకు ఎలాంటి హాని చేయకుండా బ్యాక్టీరియా లేదా వైరస్‌లు మనకు హానిచేయకుండా రోగనిరోధక శక్తిని కలిగిస్తాయి. వ్యాక్సిన్ వాడకంతో బ్యాక్టీరియా లేదా వైరస్ చంపబడతాయి లేదా బాగా బలహీనపడి, చిన్న భాగాలుగా విభజించబడతాయి, తద్వారా అవి మనల్ని అనారోగ్యానికి గురిచేయకుండా టీకా ద్వారా మన రోగనిరోధక వ్యవస్థ బ్యాక్టీరియా లేదా వైరస్‌పై దాడి చేస్తుంది. దానిని ఎదుర్కోవడానికి ప్రతిరోధకాలను ఉత్పత్తి చేస్తుంది. ఎలాగంటే రోగనిరోధక వ్యవస్థ గతంలో తాను తరిమికొట్టిన వ్యాధిని గుర్తుంచుకుంటుంది కాబట్టి టీకాలు వేసిన వ్యక్తి సంవత్సరాల తరువాత వ్యాధిని ఎదుర్కొన్నా, వారి రోగనిరోధక వ్యవస్థ దానితో పోరాడటానికి, దాని సంక్రమణ అభివృద్ధి చెందకుండా నిరోధించడానికి సిద్ధంగా ఉంటుంది.

# ఆత్మ దర్శనం



**సర్వమతాలు ఆధ్యాత్మిక అంతిమ గమ్యం ఆత్మ దర్శనమేనని ఎలుగెత్తి చాటుతున్నాయి. దేవుడు మన భౌతిక శరీరంలో ఆత్మరూపంలో ఉన్నాడని మానవుని అంతిమ జీవితలక్ష్యం, మన మనస్సు ఆత్మతో అనుసంధానం కావడమేనన్న మూలసత్యంతో దాదాపు సర్వమతాలు ఏకీభవిస్తున్నాయి.**




సింగం మల్లికార్జునరెడ్డి
కర్నూలు
సెల్ : 7032612885


"దేవుడు ఆత్మ స్వరూపుడు గనుక మీరు ఆత్మ యందును, సత్యమందును ప్రతిష్టులు కందు" అంటూ బైబిలు వాక్యాలు బోధిస్తున్నాయి. **ప్రతి శరీరంలో ఒక ఆత్మ ఉన్నట్లే, ప్రతి ఆత్మలోను దేవుడు నెలకొని ఉంటాడు.** అయన ఆత్మలతో ఏ సంబంధం లేకుండా వాటిని నియంత్రిస్తూ ఉంటాడు. మనలోని అజ్ఞానాన్ని అంత సులువుగా తెలుసుకోలేము. దాని మొదటి రూపం అహంకారం. అహంకారం ఆత్మను కప్పివేస్తుంది.

విశిష్ట అద్వైత సిద్ధాంతకర్త రామానుజుల వారు చెప్పిన ప్రకారం "మనలోని ఆత్మను సువిశాలం చేసేవన్నీ మంచివి. అలాగే ఆత్మను (బుద్ధిని) సంకుచితం చేసేవన్నీ చెడ్డవి. స్థూలంగా కనిపించేవి శరీరాలు కావని, సమస్త జీవులు ఆ శరీరాలు నశించినా, నశించని జీవుడు ఒకడున్నాడని, అనాశరహితమైన జీవుడే "ఆత్మ" అని చెప్పబడింది.

**ఆత్మ అనబడే కనిపించని దేవుని అంశ ప్రతి మనిషిలో ఉంటుందని, ఆత్మకు కుల, మత, వర్గ, రూప బేధాలు ఉండవని, మన లోపల ఉండే ఈ ఆత్మనే "అంతరాత్మ" అని పిలుస్తున్నారు.** అంతరాత్మ విషయంలో మానవులలో ఏ విధమైన తేడాలు లేవు. ఎందుకంటే ఇది ఆ పరమాత్ముని అంశే గనుక.

ఆత్మకు రూపం లేదు. అది ఒక దివ్యశక్తి. ఈ శక్తిని, చేతనను తెలుసుకోవాలని, దర్శించాలని అన్ని మతాలలో మహనీయుల ప్రయాణం కొనసాగి ఆత్మానుభూతిని కొద్దిమంది అనుభవించారు.

ప్రతి మనిషి ఒక స్థూల శరీరం, ఒక మనస్సుతో పాటు మూడోదిగా ఒక ఆత్మ ఉంది. అయితే **బాహ్య ప్రపంచంతో మనస్సు మమేకమైతే ఆత్మ దర్శనం లభించదు.** ఆధ్యాత్మిక జీవనంలో ముఖ్యమైనది సంకల్పశక్తి. ప్రలోభాలకు గురైనప్పుడు నైతిక విలువలు పాటించడం ద్వారా, ప్రార్థనలు, ధ్యానం ద్వారా మనలో నిబిడీకృతమైన ఆత్మ చేతన మేల్కొంటుంది. మనల్ని కాపాడుతుంది.

స్వామి వివేకానంద మాటలలోని భిన్నవాదనలు గూర్చి తన భావాన్ని ఇలా వెల్లడించారు. "నేను ఏ మతానికి చెందినవాడను కాను. సర్వమతాల్లో అవ్యక్తంగా ఆ పరమేశ్వరుడు దర్శనమిస్తున్నాడు. సర్వం ఏకమే. ద్వంద్వాలు సృష్టిలో లేవు. మనమే సమ రూపాలతో, ద్వంద్వాలతో విభజించుకున్నాము. సృష్టిలో అందరూ సమానమే. అన్ని మతాలు, మార్గాలు ఒకే సత్యదర్శనానికి దారితీస్తాయి. శరీరం ఏదో ఒకరోజు పడిపోక తప్పదు. దాంట్లో సందేహం లేదు. అటువంటప్పుడు సోమరితనంతో రాలిపోవడం ఎందుకు? **తుప్పుపట్టడం కన్నా అరిగిపోవడం మంచిది.** ఆందోళనవద్దు. నేను చనిపోయినా, నా ఎముకలు అద్భుతాలు సాధిస్తాయి.

మోక్షమనేది సకల ప్రాణికోటికి స్వతఃసిద్ధమైనది. ఆత్మను బంధించడానికి ఆత్మకంటే బలమైనది ఏముంది? అందరూ సత్యజ్ఞానానంద, నిత్య పుణ్యమూర్తులనే సత్యాన్ని అందరికీ తెలియజేయడానికి ప్రతి మానవునికి ఆత్మ ఉద్ధరణ, లోకోద్ధరణ ప్రవృత్తిని కలిగించడమే స్వామి వివేకానంద ఆశయం.

ప్రపంచంలోని సర్వమతాలు ఒకే సత్యాన్ని వ్యక్తీకరిస్తున్నాయి. **నీవు దేవుని అంశ కలిగి ఉన్నావు. దేవుడే నీ తండ్రి. సకల జీవరాసులు అయన అంశలే. అయన సంతానమే.** కానీ మనమే మానవులుగా, తెలివైన జీవులుగా మనల్ని ఇతర జీవరాసుల నుండి ఉత్తమంగా చిత్రీకరించుకొని ఇతర జీవుల ఉనికికి, వాటి మనుగడకు హాని కలిగిస్తున్నాం. ఈ సృష్టిలో అత్యంత ఆశాపరునిగా, స్వార్థపరునిగా మనిషి రోజురోజుకు తనను తాను దిగజార్చుకొంటున్నాడు. ఈ ప్రవర్తన దేవుని చిత్తానికి వ్యతిరేకదిశలో ఉంది. **దేవుని సృష్టిలో సామరస్య జీవనంలో ఎవరి జీవనగతి వారి మార్గాన్ని నిర్దేశించిన క్రమంలో మనిషి ఒక్కడే దైవ సూత్రాన్ని, విశ్వ చిత్రగతిని అతిక్రమిస్తున్నాడు.** అందుకే తన వినాశనాన్ని తానే కొనితెచ్చుకుంటూ ఇతర జీవరాసుల మనుగడకు భద్రతకు ముప్పు తెస్తున్నాడు.

మనిషి ప్రకృతి విరుద్ధమైన పనులు విచ్చలవిడిగా చేస్తూ తన ముప్పును తానే కొనితెచ్చుకుంటున్నాడు. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న ఘోర విపత్తు, ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న మహమ్మారి మన స్వార్థ ఫలితమే. **ప్రకృతిలో సాటి జీవులతో సామరస్యంగా జీవించకపోతే జరిగే విపత్తే ప్రస్తుత వినాశకర పరిస్థితి.** దేవుని సహాయం లేకుండా మనమెంత నిస్సహాయులమో ఇప్పటికే అర్థమై ఉంటుంది. ఇంకా ఆలస్యం చేసి మృత్యుకోరలలో చిక్కుకోక ముందే ప్రార్థన అత్యంత అవసరం. అదే మనకు గొప్ప ఆయుధం.

● ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం : మే 22

# జీవవైవిధ్యమే జీవన వేదం



**పవిత్ర బైబిల్‌లో బయోడైవర్సిటీ అనే పదం లేదు కాని, సృష్టిలోని వైవిధ్యం, సంక్లిష్టత గురించి ఎంతో గొప్పగా వివరించింది. దేవుడు ఆరురోజులు భూమిపై సమస్తాన్ని సృష్టించి, ఎలా ఉంది అని చూసినప్పుడు అది ఆయన కంటికి చాలా బాగుగా ఉండెను అని ఆదికాండం1:31లో వివరించబడింది. ప్రకటన గ్రంథంలో సృష్టిలోని నాలుగు రకాల ప్రాణులైన పక్షులు, మానవులు, క్రూర,పెంపుడు జంతువుల ప్రభువైన యేసు ప్రభుని స్తుతిస్తున్నాయని తెలియజేస్తోంది. చెట్లు, పర్వతాలు, మానవులు, జంతువులు, సముద్ర జీవులు దేవునిపై ఆధారపడి జీవిస్తున్నాయని సామెతలు 104వ అధ్యాయం తెలుపుతోంది.**




**కోలవంటి తేజస్వి**
తలితాకుమిస్పర్శ సభ్యురాలు
సెల్ : 9398659799


అయితే మానవుడి అత్యాశ, క్రూరత్వం జీవ వైవిధ్యాన్ని విలువలేనిదిగా మార్చివేసింది. పిత అయిన సర్వేశ్వరుడు అందమైన ఆనందకరమైన సృష్టిని మనిషికి ఇచ్చి సంతోషించమంటే ప్రకృతిని నాశనం చేసి ఎంతో విజ్ఞానవంతుడనని ఉప్పొంగిపోతున్నాడు. దేవుని అభీష్టానికి విరుద్ధంగా కొనసాగుతున్న ఈ దుర్మార్గాన్ని భరించలేని దేవదేవుడు భయంకరమైన వ్యాధులను వ్యాపింపచేసి మనలను ప్రకృతికి దగ్గర చేసే ప్రయత్నం చేస్తున్నాడని గుర్తెరిగితేనే మన మనుగడ భూమిపై ఉంటుందని తక్షణమే గుర్తించాలి. ఈ చరాచర సృష్టిలో కంటికి కనబడని అత్యంత సూక్ష్మ క్రిమి నుంచి అతిపెద్ద జంతువైన ఏనుగు వరకు ప్రతీది ఈ భూమికి అవసరమే.

ప్రపంచంలోని 12 మహా జీవవైవిధ్య ప్రాంతాలలో భారత దేశం ఒకటి. సుమారు 45 వేల వృక్ష జాతులు, దాదాపు 77 వేల జంతు జాతులు ఈ దేశంలో ఉన్నాయి. కానీ ఇదంతా గతం. నేడు ఆ విస్తారమైన జీవ సంపదలో 10 శాతానికిపైగా ప్రమాదంలో ఉంది. వాటిలో చాలా జాతులు అంతరించిపోయే దశలో ఉన్నాయి. గత కొన్ని దశాబ్దాలలో 50 శాతానికిపైగా అరణ్యాలు, 70 శాతానికి పైగా నీటి వనరులు లుప్తమైపోయాయి. విస్తారమైన పచ్చిక బయళ్ళను,సముద్రతీరాలను మన జీవనశైలితో రూపుమాపేశాం. ఇవన్నీ చాలవన్నట్టు అరణ్యాలలోని వన్యప్రాణుల్ని వేటాడి కొందరు అంతమొందిస్తున్నారు.

వ్యవసాయంలో రసాయనిక ఎరువులకు, కీటక నాశనులకు ప్రాధాన్యత పెరిగింది. మందుల కంపెనీల లాభాపేక్ష వాటిని అధికంగా, విచక్షణారహితంగా వాడేలా చేసింది. దీంతో మన నేలను, దానిపై నివసించే విలువైన జీవసంపదను కోల్పోవాల్సి వచ్చింది. అంతేకాదు, అత్యధిక కీటక నాశనులను ఉత్పత్తి చేసే దేశంగా భారత్ విరాజిల్లుతోంది. ఇటువంటి అవాంఛనీయ చర్యల వల్ల దారుణంగా నష్టపోయాం. అంతే కాదు అపార జీవజాతులు అంతరించిపోయాయి.

విశేషమేమిటంటే.. మన దేశంలో ఆదివాసులు (గిరిజనులు, కొండజాతి ప్రజలు) ఎక్కడున్నారో అక్కడ జీవవైవిధ్యం పదిలంగ ఉంది. మన దేశంలో 53 మిలియన్ల కంటే ఎక్కువమందే ఆదివాసులు నివసిస్తున్నారని అంచనా. వారిలో దాదాపు 53 తెగలున్నాయి. మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్‌లో 80 శాతానికంటే ఎక్కువమంది గిరిజనులు ఉన్నారు. అక్కడే జన్యు, పంటలలో వైవిధ్యాలు అధికం. ఇటీవల జన్యుమార్పిడి కూడా జీవవైవిధ్యాన్ని దెబ్బ తీస్తోంది. వీటిని రూపొందించే, ప్రవేశపెట్టే విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రక్షణ సంబంధమైన నియంత్రణలను పాటించాలి. జన్యుమార్పిడివల్ల వచ్చే ప్రభావాలు స్వల్పకాలంలో, దీర్ఘకాలంలో ఎలా ఉంటాయో పూర్తి అధ్యయనం చేయకుండా వీటిని ఏ జీవజాతుల్లోనూ ప్రవేశపెట్టకూడదు. తొందరపడితే జీవజాతికే ప్రమాదం వాటిల్లుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. జీవవైవిధ్యమే జీవన వేదమని గుర్తెరగాలి.

చైనాలోని కమ్యూనిస్టు ప్రభుత్వం ఒకసారి పిచ్చుకలు ఏడాదికి ఎంత పంటను తింటున్నాయి..? ఆ ధాన్యంతో ఎందమందికి ఆకలి తీర్చవచ్చు అని లెక్కలు కట్టి, దేశంలోని అన్ని పిచ్చుకలను ఏరి (కాల్చి) పారేశారు. దీంతో మరిన్ని కుటుంబాలను క్షుద్బాధ నుంచి తప్పించవచ్చును కున్నారు కాని వారి అంచనా పూర్తిగా తప్పని నిరూపణ అయ్యింది. ఎలాగంటే ఆ ఏటి పంటకు చీడపీడలు పట్టి పంటలన్నీ నాశనమై, ప్రజలు దుర్భర దారిద్ర్యం అనుభవించాల్సి వచ్చింది. పిచ్చుకలు లేకపోవడం వల్లే చీడపీడలు విజృంభించాయని ప్రభుత్వం తన తప్పులను తెలుసుకొని ఇతర దేశాలనుంచి పిచ్చుకలను దిగుమతి చేసుకుంది.

భారతదేశంలో పుట్టి ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన యోగ ప్రకృతిలోని పశు, పక్ష్యాదులను పరిశీలించి పొందుపరచిందే.. ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూర్చి సంపూర్ణ ఆరోగ్యం ఇచ్చే అనేక భంగిమలు (పిల్లి, గుర్రం, ఒంటె, కుక్క వంటి) జంతువులవే. అంతేకాకుండా ఆనాడు ఉపయోగంలో ఉన్న ధనుస్సు, హలం (నాగలి) వంటి భంగిమలను సాధనం చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రపంచం గుర్తిం చింది. కపాలభాతి, భస్త్రిక, ప్రాణామాయాలు జంతువులు చేస్తాయని మీలో ఎంతమందికి తెలుసు? ప్రకృతిలో చిన్న ప్రాణి అయిన ఉడుత పైవన్నీ చేస్తున్న వాట్సప్ ఈ మధ్య కాలంలో బాగా వైరల్ అయ్యింది కదా..!

మనకు ఆరోగ్యాన్ని ఇచ్చే అనేక మూలికలు, పండ్లు, వేర్లు, కందమూలాలు, తేనే, కుంకుళ్లతోపాటు వైవిధ్య భరితమైన జీవరాశులకు ఆనవాలమైన అడవులను ఖనిజాలు కోసం తెగనరుక్కుంటూ వెళుతున్న మానవుడు తన ఉనికిని ప్రశ్నార్థం చేసుకునేందుకు తహతహలాడుతున్నాడు. పక్షిలా ఎగరలేడు.. చేపలా ఈదలేడు.. ఏనుగులా బలవంతుడు కాదు.. అయినా ఈ సృష్టికి అధినేతగా ఉండమని దేవుడు మనిషికి ఆదేశిస్తే.. దాని ఫలాలు అనుభవించి సుఖజీవనం సాగించే బదులుగా కరెన్సీ కట్టలకు దాసుడుగా మారి ప్రకృతి వినాశనానికి ఒడికడుతుండటం అత్యంత బాధాకరం. జీవవైవిధ్యం లేని నిస్సార భూగోళంలో కరెన్సీ నోట్లు ఎందుకు కొరగావని తెలుసుకున్న రోజునే మానవుడు దేవుని చెంతకు చేరి జీవన మాధుర్యాన్ని అనుభవించగలడు.



"మీకు శాంతి కలుగునుగాక! నా తండ్రి నన్ను పంపినట్లు నేను మిమ్ము పంపుచున్నాను" అని పలికెను. అట్లు పలికి ఆయన వారి మీద శ్వాస ఊది "పవిత్రాత్మను పొందుడు" (యోహాను 20:21-22) అన్నారు. పాస్కా కాలంలో చివరి రోజు (50వ రోజు) పెంతెకోస్తు పండుగ జరుపుకుంటాం.

పెంతెకోస్తు ఆదివారం, 23.05.2021

# నిత్యం పవిత్రపరిచే పవిత్రాత్మ నీలో నాలో ఉంది

అపో.కా 2:1-11; 1 కొరింతి 12:3-7, 12-13; యోహాను 20:19-23


సిస్టర్ ఉష
సెయింట్ అలోషియస్ కాన్వెంట్,
ఆకవీడు, పశ్చిమ గోదావరి
సెల్ : 9550172230




- పవిత్రాత్మ ఒక వస్తువు కాదు. పవిత్రాత్మ త్రిత్వంలో ఒక వ్యక్తి
- ఆత్మ దేవుడు అనుగ్రహించే వరాలన్నీ అబ్బురపరిచేవే. అవి ధనవంతులను కాదు, విశ్వాసులను అనుగ్రహిస్తాయి
- పవిత్రాత్మ ఆవరించినపుడు మానవరూపం అంతమై దైవరూపం ఆవిష్కృతమౌతుంది

మోక్షరోహణమైన యేసుక్రీస్తు పరలోకంలో తన సింహాసనాన్ని అధిష్టించి మనకై చేసిన చివరి పని తన పరిశుద్ధాత్మను మనపై క్రుమ్మరించడం. ఓదార్చువాడు, అదరణకర్త, సత్యస్వరూపియైన పరిశుద్ధాత్మ సర్వేశ్వరుడు అపోస్తలులపైకి దిగిరావడం మనం ఈనాడు కొనియాడుతున్నాం (అపో.కా. 1:8). పవిత్రాత్మ మీపైకి వచ్చినపుడు మీరు శక్తిని పొందుదురు. ఈ పండుగ సందర్భంగా మనం ఆత్మ పరిశీలన చేసుకోవాలి. మనలను నడిపించే శక్తి ఏది? దేవుని ఆత్మా? సాతానా?

పూర్వవేద కాలంలో కూడా పెంతెకోస్తు పండుగను ఒక వ్యవసాయ సంబంధిత పండుగగా జరుపుకునేవారు. ఆనాటి కాలంలో ఇశ్రాయేలీయులు గోధుమపంటను ఎక్కువగా పండించేవారు. ఏడువారాల తర్వాతి రోజు పంటలో కొంత భాగాన్ని దేవునికి కృతజ్ఞతగా అర్పించి పండుగ చేసుకొనేవారు. ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి దాస్యవిముక్తి పొంది 50 రోజులు పయనించి సీనాయి పర్వతం చేరుకున్నారు. అక్కడ **యావేప్రభువు మోషేకు 10 ఆజ్ఞలనిచ్చాడు. అదే పండుగరోజున ఇప్పుడు నూతన వేదంలో పవిత్రాత్మ దిగివచ్చిన సంఘటనను పెంతెకోస్తు పండుగగా జరుపుకొంటున్నాం.** అంటే పాస్కా పండుగ ముగిసిన 50 రోజులకు వచ్చే పండుగే పెంతెకోస్తు పండుగ.

పవిత్రాత్మ ఎవరు? యేసుక్రీస్తు పవిత్రాత్మ 'అది ఇది' అని సంబోధించకుండా 'అయన' అని సంబోధించారు. అంటే పవిత్రాత్మ ఒక వస్తువు కాదు. ఒక వ్యక్తి. త్రిత్వంలో ఒకరు. యేసుక్రీస్తును నమ్మి, విశ్వసించిన వారితో కలకాలం ఉండేవారు. పవిత్రాత్మ ఎందుకు వచ్చారు? ఎప్పుడు వచ్చారు? ధ్యానిస్తే పవిత్రాత్మ రాకడ "శ్రీసభ జన్మదినోత్సవం" అని కొనియాడవచ్చు.

**పవిత్రాత్మ రాక యేసుక్రీస్తు మోక్షరోహణ ఫలితం. యేసుక్రీస్తు పరలోకానికి వెళ్లడంతో పవిత్రాత్మ దిగి వచ్చారు.** పెంతెకోస్తు రోజున శిష్యులపై పవిత్రాత్మ వేంచేశారు. పవిత్రాత్మ ఎందుకు రావలసివచ్చింది అంటే: యేసుక్రీస్తు తన వాగ్దానాన్ని నెరవేర్చడానికి "నేను ఎల్లప్పుడూ మీతోనే ఉంటాను" అన్నారు. మనతో వాసం చేయడానికి ఇప్పుడు ఆత్మ రూపంలో ఉన్నారు. మనలో జీవిస్తున్నారు. మనలో వేంచేసిన పవిత్రాత్మ ఏం చేస్తారు?: మనకై ప్రార్థిస్తారు (రోమా 8:26); మనలను నడిపిస్తారు (రోమా 8:14); మనలను శుద్ధి చేస్తారు (హెబ్రీ 9:14); మనలను శక్తితో నింపుతారు (లూకా 1:35); మనలో నిత్యం జీవిస్తారు (అపో.కా. 1:5).

**మనకై ప్రార్థిస్తారు:** "బలహీనులమైన మనకు ఆత్మ కూడా సాయపడుతుంది. ఎలాగంటే మనం ఎలా ప్రార్థించాలి మనకు తెలియదు. మాటలకు సాధ్యపడని మూలుగుల ద్వారా మనకొరకై ఆత్మయే దేవుని ప్రార్థిస్తుంది". పాపం చేత, ఈ లోక ఆశల చేత, ఒత్తిడి ప్రపంచంలో తినడానికి, మాట్లాడడానికి, ప్రార్థించడానికి సమయం

చాలడంలేదు. అటువంటి సమయాల్లో **దేవునికి దూరంగా ఉంటూ దేవుని కార్యాలకు, ప్రార్థనలకు దూరమైనప్పుడు మనలో ఉన్న ఆత్మ మనకై ప్రార్థిస్తుంది. మన భవిష్యత్తు అవసరాలలో సతమతమౌతున్నప్పుడు మనకై ఆత్మదేవుడు ప్రార్థిస్తారు.** ఒకవేళ దేవునితో సత్సంబంధాలు తొలగిపోయినా ఆత్మదేవుడు వారధిగా పనిచేస్తాడు. ఏదో ఒకరోజు మళ్ళీ మనం దేవుని సన్నిధికి రావడం తథ్యం. అదే ఆత్మదేవుడు చేసే గొప్ప పని. మనకై ప్రార్థిస్తూ దేవుని చెంతకు చేరుస్తారు.

**ఆత్మదేవుడు నడిపిస్తారు:** "దేవుని ఆత్మ వలన నడుపబడేవారు దేవుని పుత్రులు. ఆత్మతో నడిపింపు అనేది బైబిలు గ్రంథంలో చాల మంది వ్యక్తులను చూస్తున్నాం. వారందరూ పవిత్రాత్మతో నింపబడిరి. అప్పుడు పవిత్రాత్మ వారికి శక్తిని అనుగ్రహించిన కొలది వారు అన్యభాషలలో మాట్లాడసాగిరి". భయంతో, వేదనతో, బాధతో నిండిన శిష్యులు పవిత్రాత్మతో నింపబడ్డారు. ప్రసంగించారు. వారి ప్రసంగాలు, సువార్త బోధనలు ఆలకించిన వారు సంబరపడ్డారు, ఆశ్చర్యపడ్డారు. వీరు అన్యభాషలలో మాట్లాడటం విని కలవరపడ్డారు. వారు విస్మయం పొందారు. **అనేక భాషలలో శిష్యులు మాట్లాడుతున్నారని అనుకున్నారుగాని, వారు మాట్లాడింది ఒకే ఒక్క భాష. ఆత్మపూరితమైన భాష. ఆ భాష వచ్చిన ప్రతివాడు దేవుని పుత్రుడు అని వాక్యం చెబుతోంది.** ఆ భాష మాట్లాడినప్పుడు చెవులకు ఇంపుగాను, నోటికి తియ్యగాను ఉండటంవల్ల అనేక మంది అనేక భాషలలో వారివారి భాషల్లో విన్నారు. ఆత్మదేవుడు శిష్యులకు తన ఆత్మనొసగి నడిపించాడు. ఆ నడిపింపు ఆ రోజుతో ఆగలేదు. ఈనాటికీ కొనసాగుతూనే ఉంది. శిష్యులు ఆత్మపూరితులై దేశదేశాలు వెళ్లి బోధించారు. కాబట్టి ఈనాటి క్రైస్తవులమైన మనం దేవుని నడిపింపులో కొనసాగుతూ ఉన్నాం.

**పవిత్రాత్మ మనలను శుద్ధిచేస్తారు:** "అటులైనచో ఇక నిత్యుడగు ఆత్మ ద్వారా తన్నుతాను దేవునికి నిర్దోషిగా అర్పించుకొన క్రీస్తు రక్తం నిర్జీవక్రియలను విడిచి సజీవదేవుని సేవించుటకు మన అంతఃకరణములను ఇంకను ఎంతగానో శుద్ధిచేయునుగదా!

జంతువుల రక్తం, దూడలరక్తం ప్రజలపై చల్లినప్పుడు ప్రజల శరీరం శుద్ధి అయినదిగానీ, ఎప్పుడైతే ఏసుక్రీస్తు తన రక్తాన్ని చిందించారో అప్పుడు మనకు శాశ్వతరక్షణను ఒసగాడు. ఆయన శరీరరక్తాలు ఆత్మపూరితమైనవి. **నిత్యుడైన ఆత్మ ద్వారా యేసుక్రీస్తు తనను తాను నిర్దోషిగా అర్పించుకున్నారు.** పవిత్రాత్మ దేవుడు నిరంతరం, నిత్యం జీవిస్తున్న దేవుడు అని విశ్వసించాలి, నమ్మాలి. ఎప్పుడైతే నమ్ముతామో ఏసుక్రీస్తు శరీరరక్తాలు అర్పణకు సహకరించిన ఆత్మ, పాపులమైన మనం కూడా మన దేహాలు దేవునికి అర్పించుకోడానికి సహాయపడుతుంది.

**పవిత్రాత్మ మనలను శక్తితో నింపును :** "పవిత్రాత్మ నీపై వేంచేయును. సర్వోన్నతుని శక్తి నిన్ను ఆవరించును". దేవుని సువార్తను స్వీకరించిన మరియతల్లి జీవితంలో ఒక అద్భుతమైన సంఘటన చోటుచేసుకుంది. శుభవార్తను అంగీకరించిన తోడనే త్రిత్వుడైన దేవుడు ఆ అమ్మలో వేంచేసి ఉన్నారు. పవిత్రాత్మ దేవుడు నీలో ఉంటాడు. దేవాదిదేవుని శక్తి నిన్ను ఆవరించును. నీవు ఒక పుత్రుని కంటావు. ఆయనకు యేసు అని పేరు పెడతావు. ఎందుకంటే దేవునికి అసాధ్యమైనది ఏదీలేదు అని **ఎప్పుడైతే మరియమ్మ విన్నదో ఆమె ఆశ్చర్యంతో, భయంతో వణికిపోయి ఉండొచ్చు.** అంతగొప్ప దేవుణ్ణి నేనెలా భరించగలను? నేనెలా మోయగలను? నేనెలా ఈ కార్యాన్ని సాధించగలను? అనుకుంటూ మరియతల్లికి కష్టంగా ఉన్నా ఇష్టంగా స్వీకరించింది. రక్షణకార్యంలో పాత్రధారైంది. దేవునిశక్తి మరియతల్లిని నడిపించింది. దేవునిశక్తి, మహిమ తన జీవితంలో నూరంతలుగా అనుభవించింది.

**పవిత్రాత్మ నిత్యం మనలో జీవిస్తారు:** "ఏలయన యోహాను నీటితో బాప్తిస్మమును ఇచ్చెను. కానీ కొన్ని దినములలో మీరు పవిత్రాత్మచేత జ్ఞానస్నానమును పొందుదురు."

పవిత్రాత్మ శిష్యుల మీదకు అగ్ని నాలుకల రూపంలో దిగివచ్చింది పరిశుద్ధ గ్రంథంలోని అనేక రూపాలలో అగ్ని ఒక పవిత్రరూపం. పలు రకాల్లో, వివిధరూపాల్లో కనిపిస్తుంది. అది నీరు, పావురం, ద్రాక్షారసం, గాలి. అది నిజంగా దిగివచ్చినపుడు మాత్రం ఒక అగ్నిరూపం ప్రత్యక్షపరుస్తుంది. మన కరుడుగట్టిన గుండెను మాంసపు గుండెగా మారుస్తుంది. కరుకుగా ఉన్న జీవితం, **స్వార్థంతో నిండిన జీవితం ఆత్మ దిగివచ్చినపుడు నిర్మలంగా, నెమ్మదిగా, వినయంగా, సాధుస్వభావం కలదిగా మారిపోతుంది. ఆత్మ మనలను దేవుని రూపంలోకి మారుస్తుంది.** పాపం ద్వారా దైవరూపం కోల్పోయిన మనకు తిరిగి పవిత్రమైన రూపాన్ని (ఆదిరూపాన్ని, అనగా అవ్వ ఆదాములు పొందిన మహిమ రూపాన్ని) సంక్రమింపజేస్తుంది. మానవరూపం అంతమై, దైవరూపంలోకి మారిపోతుంది. ఇది ఆత్మకార్యం. మనమూ రూపాంతరం చెంది ఆత్మపూరితులుగా మారుటకు ప్రయత్నిద్దాం. ఆత్మదేవుని మన హృదయాలలో నింపుకుందాం. ఆత్మదేవుడు మనలో నిత్యం జీవించాలని కోరుకుందాం.

## కోవిడ్ రోగులకు మదర్ సాయం



కోవిడ్‌తో బాధపడుతున్న వారికి ఆస్పత్రుల్లో బెడ్లు దొరకని పరిస్థితి ఏర్పడిననేపథ్యంలో.. వారికి సాయం చేసేందుకు తమ మదర్ హౌజ్ ను ఇచ్చేందుకు ఓ కతోలిక మదర్ ముందుకొచ్చారు. కేరళకు చెందిన మాహెర్ ఫౌండర్ డైరెక్టర్ సిస్టర్ లూసీ కురియన్ దేశ వ్యాప్తంగా తమ సంస్థకు ఉన్న పలు హౌజ్ లను కోవిడ్ రోగులకు ఇచ్చి, అక్కడ చికిత్సఅందించే ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి అనుమతి ఇచ్చారు. కరోనా కారణంగా విషాద ఛాయలు అలుముకుంటున్న ప్రపంచానికి ఎంతో కొంత సాయం అందించేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆమె వెల్లడించారు. రెండు అంబులెన్సులను సైతం ఆయా హౌజుల వద్ద ఏర్పాటు చేశారు.



త్రిత్వైక సర్వేశ్వరుని మహోత్సవం, 30.05.2021

# త్రిత్వం విశ్వాస సత్యం



రెవ. ఫా॥ బుర్రి జాన్ పీటర్
విజయవాడ
సెల్ : 9966778465

ద్వితియో 4:32-34; రోమీ 8:14-17; మత్తయి 28:16-20

- అద్వితీయుడైన దేవునిలో ఏ మార్పు ఉండదు. అంతం నుంచి అనంతం వరకు ఆయనొక్కడే
- తండ్రి తనయులు పరస్పర విధేయులు. తండ్రి నేర్పినవే తనయుడు చేస్తాడు
- ఒకే దైవిక తత్వంలోని త్రిత్వంలో ప్రతి వ్యక్తి సర్వోన్నత సత్యం

త్రిత్వం అంటే ముగ్గురు కాని ఒక్కటి. ఈ వేద సత్యాన్ని అర్థంచేసుకోవటం అంత సులభతరం కాదు. మహా మహా వేదపండితులే దీని గురించి మితంగానే అర్థం చేసుకొని పొందుపరచియు న్నారు. అందు ప్రముఖమైన వ్యక్తి పునీత అగుస్తీనుగారు. ఈ వేద రహస్యాన్ని ఎంత అర్థం చేసుకోవాలనుకున్నా, చాలా మితంగానే అర్థం చేసుకు న్నాడు. **సర్వంతర్యామి అయిన దేవుని గురించి, అమితమైన మేథోసంపద, ఉనికి కలిగిన దేహాన్ని ఎంతవరకు మనం అర్థం చేసుకోగలం?** మన మానవ మేధస్సు ఎంతవరకు సహకరిస్తుంది? శ్రీసభ మనకు బోధించునది పిత దేవుడు, సుత దేవుడు, పవిత్రాత్మ దేవుడు. ఈ ముగ్గురు, ముగ్గురు దేవుళ్ళా లేక ఒకే దేవుడా? ఒకే దేవుడు! ఇది దైవ రహస్యం దీనిని చేధించటానికి ఎంతో మంది చరిత్రలో ప్రయత్నించారు, గ్రంథాలు రచించారు.

**తండ్రి :** తండ్రి దేవుని సృష్టికర్తగా మనందరం పూజిస్తున్నాం. దేవుడు పూర్వం తనంతట తానే బయల్పరచుకున్నాడు. యవ్వనుడైన మోషే అడిగిన ప్రశ్నకు మొట్టమొదటిసారిగా ఇశ్రాయేలీయులకు జవాబు దొరికింది. "ప్రభువులకు ప్రభువైన" **యావే తన నామాన్ని "ఉన్నవానిగా" (నిర్గ 3:14) ఈ లోకానికి బహిర్గతం చేసాడు.** తద్వార అప్పటి వరకు ఐగుప్తులో ఉన్న విశ్వాసమంతా నిదానంగా సన్నగిల్లింది. అప్పటి వరకు తెలియని దేవుళ్ళను, దేవతలను పూజించిన మనుషులు ఆలోచించటం మొదలుపెట్టారు. సూర్యున్ని, నక్షత్రాలను పూజించిన వారు వానిని సృజించిన వాని వైపు చూడటం మొదలు పెట్టారు. నిజమైన దేవుడు లోకానికి పరిచయమయ్యాడు. ఓ ఇశ్రాయేలు నీ దేవుడైన యావే "ఒక్కడే" అన్న నినాదం వారి విశ్వాసానికి పునాది అయ్యింది.

**"దేవుడు 'ఉన్నవాడు' :** సత్యం, ప్రేమ ఆయనే, నిత్యం ప్రేమ చూపువాడు, నమ్మదగిన వాడు. అలాంటి దేవుడు యిస్రాయేలు ప్రజలకు తనను బయలు పరచుకున్నాడు. ఈ రెండు పదాలు దైవనామంలో దాగియున్న సంపత్తిని క్లుప్తంగా వ్యక్తం చేస్తాయి. ఆయన చేసే ప్రతి పనిలో తన దయను, మంచితనాన్ని, కరుణను, అచంచల ప్రేమను ప్రదర్శిస్తాడు. అంతేకాదు తన విశ్వసనీయతను, నిలకడను, విశ్వాస పాత్రతను సత్యాన్ని కూడ ప్రదర్శిస్తాడు. నీ ప్రేమను, విశ్వసనీయతను చూసి, నీ పేరుకు వందనాలు అర్పిస్తాను. **దేవుడు సత్యం, దేవుడు వెలుగు, ఆయనలో చీకటి ఏ మాత్రం లేదు.** దేవుడు ప్రేమ అని అపోస్తులుడు యోహానుగారు బోధించాడు.

దేవుడు మోషేతో, యూదులతో సీనాయి చెంత చేసుకున్న ఒడంబడిక వలన దేవునికి ప్రజలకు ఏర్పడిన గాఢ సంబంధాన్ని పూర్వవేద రచయితలు వర్ణించారు. దేవుడు కాపరి ప్రజలు మందలు, ఆయన వరుడు ప్రజలు వధువు, అతడు తోటమాలి ప్రజలు తోటలాంటి వాళ్ళు. యావె తండ్రిలాంటి వాడు యిస్రాయేలు కుమారుని వంటివాడు. యావె భవన నిర్మాత

యిస్రాయేలు అతడు నిర్మించిన భవనం.

"దైవనామ బయల్పాటులో అనంత సంపత్తి దాగుంది. ఈ సంపదను యిస్రాయేలు ప్రజల విశ్వాసం ఆయా శతాబ్దాల్లో ప్రదర్శిస్తూ, మరింత లోతుగా అవగాహన చేసుకోగలిగింది. దేవుడు అద్వితీయుడు. అతని సాటి దైవం మరొకరు లేడు. ప్రపంచానికీ, చరిత్రకు అతీతుడాయన. పరలోకాన్ని, భూలోకాన్ని సృష్టించాడు. "భూమ్యా కాశాలు గతిస్తాయి, కాని నీవు నిలిచివుంటావు. అవన్నీ వస్త్రాలలాగా చినిగిపోతాయి. కాని నీవు ఎల్లవేళలా ఏకరీతిగా ఉంటావు. నీ ఆయుస్సుకు అంతం లేదు. **దేవునిలో ఏ మార్పు లేదు. ఎప్పుడూ ఒకే విధంగా ఉంటాడు. అతడు ఒక్కడే ఉన్నాడు.** ఆయనే దేవుడు. అనంతం నుంచి అనంతం వరకూ తన వాగ్దానాలకు కట్టుబడి ఉంటాడు".

చాలా మతాలు దేవుణ్ణి "తండ్రి" అని సంబోధిస్తాయి. దీని ద్వారా ప్రజలకు దేవునికి మధ్య ఉన్న బంధాన్ని సూచించబడింది. ప్రపంచ సృష్టి కర్త అనే భావంతో యిస్రాయేలు ప్రజలు దేవుణ్ణి "తండ్రి"గా వ్యవహరించారు. అంతేకాదు, తన తోటి కుమారుడు యిస్రాయేలుకు దేవుడు అందించిన కానుక ధర్మశాస్త్రం, వాళ్ళతో చేసుకొన్న ఒప్పందం కారణంగా కూడ ఆయన వాళ్ళకు తండ్రి. యిస్రాయేలు ప్రజలను పాలించే రాజుకు కూడ ఆయన తండ్రి. అన్నిటికన్నా ముఖ్యంగా ఆయన పేదల, అనాథల, వితంతువుల పాలిటి తండ్రి. ఆయన ప్రేమ సంరక్షణలో వాళ్ళుంటారు. **తండ్రి కుమార పరిశుద్ధాత్మలు వేరు వేరు వ్యక్తులుగా మానవ రక్షణ చరిత్ర ప్రణాళిక మనకు విధితమైనా అన్నిటిలో వారు సరిసమానమే.**

**క్రీస్తు :** త్రిత్వంలో రెండవ వ్యక్తి, మానవ రక్షణ ప్రణాళికను యోచించిన దేవుని పుత్రుడుగా యేసు మనకు పరిచయమవుతున్నాడు క్రీస్తు, తండ్రి ఒకరియందొకరు నెలకొని వుంటారు. నేను తండ్రియందు, తండ్రి నాయందు ఉన్నామని మీరు విశ్వసించండి (యోహా 14:11). **క్రీస్తుకీ తండ్రికి ఉండే అవినాభావ సంబంధం, క్రీస్తుకీ శిష్యులకూ ఉండే సంబంధం కంటే బలమైంది.** పూర్వవేద ప్రజలకూ యావేకూ ఉండే సంబంధం కంటే బలమైంది. కుమారుని జీవానికి, తాను చేయు అద్భుతాలకు మూలం, కేంద్రం, తండ్రియే (యోహా 14:10).

క్రీస్తు, తండ్రి ఒకరినొకరు ప్రేమించుకొంటారు. కుమారుడు తన ప్రాణాలను ధారపోస్తాడు కనుక పిత అతన్ని ప్రేమిస్తాడు (యోహా 10:17). కుమారుడు కూడ తండ్రిని ప్రేమించి అతడు ఆజ్ఞాపించిన సిలువ మరణానికి బద్ధుడయ్యాడు (యోహా 14:31). తండ్రికి తన పట్లగల ప్రేమకు లొంగి, ఆ ప్రేమకు బదులు ప్రేమను చూపడానికే, క్రీస్తు సిలువ మరణాన్ని అంగీకరించాడు. **క్రీస్తు, తండ్రి పరస్పర విధేయులు. తండ్రి చిత్తాన్ని నెరవేర్చి అతడు నియమించిన పనిని చేయడమే క్రీస్తుకి ఆహారం** (యోహా 4:34). తండ్రి యిచ్చిన శ్రమల పాత్రను అతడు పానం చేసి తీరుతాడు (యోహా 18:1). అతడు తన అద్భుతాలను తండ్రి నియమించినట్లుగానే చేసాడు. అలాగే అతని బోధలు కూడ తండ్రి బోధలే. తండ్రి నాకు నేర్పిన సంగతులనే నేను మీకు చెప్తున్నాను అన్నాడు క్రీస్తు (యోహా 8:28), కొన్ని సందర్భాలలో క్రీస్తు, తండ్రి నాకంటే గొప్పవాడు అని చెప్తాడు. నరావతారుడుగా అతడు దేవునికంటే తక్కువ వాడు. ఇది కూడ అతని విధేయతనే సూచిస్తుంది. కుమారుడు అడిగినదంతా తండ్రి ప్రేమతో చేస్తాడు. అతడు అడిగినంతనే జనకుడు పవిత్రాత్మను పంపుతాడు (యోహా 14:16). ఆయనను జీవంతో లేపుతాడు (యోహా 11:14). సుతుడు ఎల్లపుడు తండ్రికి ప్రీతికలిగించే పనులు మాత్రమే చేసేవాడు (యోహా 8:29).

తండ్రి కుమారులు ఇద్దరు గాఢపరిచయస్తులే. నన్ను నా తండ్రి యెరిగినట్లుగా నేను నా తండ్రిని ఎరుగుదును అన్నాడు ప్రభువు (యోహా 10:15). వాళ్ళిద్దరికి పరస్పర జ్ఞానం ఉంది. మనకు కూడ తండ్రి కుమారులు కొంతవరకు తెలుసు కాని మన జ్ఞానం వేరు. ఆ తండ్రి కుమారుల పరస్పర జ్ఞానం వేరు. తండ్రి తప్ప ఎవరు కుమారుని ఎరుగరు. కుమారుడు తప్ప మరెవ్వరు తండ్రిని ఎరుగరు (మత్త 11:27, లూకా 10:22) అని సువిశేషం మనకు బోధిస్తుంది. క్రీస్తు తండ్రీ! గడియ వచ్చినది. నీ కుమారుడు నిన్ను మహిమ పరచడానికి. నీవు నీ కుమారుని మహిమ పరచు (యోహా 17). **పౌలు క్రీస్తు మరణాన్ని అవమానంగానూ, ఉత్థానాన్ని మహిమనుగాను వర్ణించారు.** కాని యోహాను సువిశేషం క్రీస్తు మరణాన్ని మహిమగా వర్ణిస్తుంది. కారణం దేవుడు ప్రేమ స్వరూపుడు (1యోహా 4:8).

క్రీస్తు తండ్రి వీరి ఐక్యత మహిమకరం. క్రీస్తు నేనూ తండ్రీ ఒకటే అని చెప్పాడు (యోహా 10:20). అతడు తండ్రి గుణాన్ని తనకు ఆరోపించుకున్నాడు. పూర్వవేదంలోని యావే ప్రభువు నేను ఉన్నవాడను అని మోషేకు చెప్పాడు (నిర్గ 3:14). దీనికి సమానంగా క్రీస్తు కూడ "నేనే ఆయనను" అని చెప్తుంటాడు (యోహా 18:5). చాలాసార్లు క్రీస్తు తండ్రి గుణాలు తనకు ఆరోపించుకున్నాడు పూర్వవేదంలో దేవుడు జీవజలం ఇచ్చేవాడు. క్రీస్తు కూడ జీవజలం ఇస్తాడు (యోహా 4:16). యావెలాగే క్రీస్తు కూడ మంచి కాపరి (యోహా 10:11). దేవుడు ప్రజలకు ఎడారిలో మన్నా భోజనం దయచేస్తాడు. క్రీస్తు కూడ జీవాహారం (యోహా 6:35). తండ్రిలాగే కుమారుడు కూడ వెలుగు (యోహా 8:12). తండ్రి జీవం కలవాడు సుతుడు కూడ జీవమిచ్చేవాడు (యోహా 5:16). తండ్రిలాగే కుమారుడు కూడ పనిచేసేవాడు (యోహా 5:17). **పవిత్రాత్మను తండ్రి కుమారులు ఇద్దరు కలిసి పంపుతారు** (యోహా 14:26, 15:36). **తండ్రి కుమారులు ఎంతగా ఐక్యమై ఉంటారంటే వారిలో ఒకరికున్నది మరొకరికి కూడ ఉన్నట్లే** (యోహా 17:10). ఇంకా తండ్రిని గౌరవిస్తే సుతుని గౌరవించినట్లే (యోహా 5:23). అతన్ని స్వీకరిస్తే ఇతన్ని స్వీకరించినట్లే (యోహా 13:20). ఆయనను చూస్తే ఈయనను చూచినట్లే (యోహా 14:9).

**పవిత్రాత్మ :** పరిశుద్ధాత్మ, పావనాత్మ, పవిత్రాత్మ ఈ విధమైన పేర్లతో ఆత్మను అర్థం చేసుకోవటానికి ప్రయత్నిం చేస్తుంటాం. పరిశుద్ధ గ్రంథం ఆధారంగా ఈ ఆత్మ బయల్పరచుకున్న రూపాలు మనకు కనిపిస్తాయి. పావురం, అగ్ని, గాలి, నాలుక మొదలైనవి. జలం, అభిషేకం, మేఘం, ముద్ర, చేయి, వ్రేలు మొదలైనవి మరి కొన్ని సంకేతాలు. **బైబుల్ గ్రంథ ఆధారంగా ఆత్మకు ప్రధానమైన హీబ్రూ పేరు "రువా" (ఆత్మ). మరియొక పేరు ఊపిరి, ఆత్మ "ఆదరణ కర్త"** (యోహా 14:16). **ఓదార్చే వాడని ఈ పేరుకి అర్థం.** తండ్రి కుమారుల ప్రేమబంధం ఈ పరిశుద్ధాత్మ. పరిశుద్ధాత్మ 'సత్య స్వరూపి' (యోహా 16:13). రక్షణ ప్రణాళికను తెలియజేసే వాడని అర్థం. పరిశుద్ధాత్మ దేవుని వాగ్దానం (గలతి 3:14). "దత్త పుత్రత్వపు ఆత్మ" (రోమి 8:15). మహిమగల ఆత్మ (1పేతురు 4:14). ఈ విధమైన పేర్ల ద్వార దివ్యసంస్కారాల ద్వార మనం స్వీకరించు ఆత్మ, మనలను నడిపించు

(తరువాయి భాగం 20వ పేజీలో...)



# పునీత లొయోలాపురి ఇన్యాశివారి పరివర్తన పంచశత వార్షిక ఉత్సవం

**పునీత లొయోలాపురి ఇన్యాశివారి పరివర్తన పంచశత ఉత్సవం సందర్భంగా జేసుసభ గురువుల సహకారంతో పునీత లొయోలాపురి ఇగ్నేషియస్‌వారి జీవన విశేషాలు తెలుసుకొని ఆస్వాదించడం మన పరివర్తనకు కూడా దోహదపడుతుంది. ముందుగా ఇగ్నేషియస్ వారి జీవిత విశేషాలను అందజేస్తున్న జేసుసభ గురువులకు భారతమిత్రం తరపున శుభాకాంక్షలు.** – సంపాదకులు




పూజ్య గురువు పసల బాలశౌరి
రెక్టర్, ఆంధ్ర లయోలా కళాశాల,
విజయవాడ
సెల్ : 9849440532


**ప్రభు సేవలో ఎడతెగని, నిరంతర దాహార్తి కలిగి, అలుపెరుగని సైనికుడివలే తన తుది శ్వాస వరకు వెనుదిరిగి చూడక క్రీస్తు రాజ్యం కోసం, తిరుసభ ఔన్నత్యం కోసం అహర్నిశలు శ్రమించి అసువులు బాసిన పునీత లొయోలాపురి ఇన్యాశివారి పరివర్తన పంచ శతవార్షిక ఉత్సవం (20, మే నెల, 1521-31 జూలై 2022) సందర్భంగా, ఆంధ్ర శ్రీసభకు క్రైస్తవ్యాన్ని పరిచయం చేసి, ఘన కీర్తిఘటించిన ఇన్యాశివారు స్థాపించిన జేసుసభకు చెందిన ఆంధ్ర జేసుసభా మండలి ఆంధ్ర మరియు తెలంగాణ క్రైస్తవజనావళికి సగర్వంగా అందిస్తున్న సమగ్ర శీర్షికావళి "తిరుసభలో పునీత లొయోలాపురి ఇన్యాశివారు జేసుసభ" ఈ మొదటి సంచికలో మనం "ఇన్యాశివారి జీవితంలో దేవుని ప్రణాళికాదర్శనం" అనే విషయాన్ని చర్చించుకుందాం, ధ్యానించుకుందాం.**

దేవుడు ఈ సృష్టిని ఒక ప్రణాళిక ప్రకారం నడుపుతున్నారని, అందులోను మానవజాతిని తన రక్షణ ప్రణాళికానుసారంగా నడిపిస్తున్నారని మనందరి విశ్వాసం, సత్యము కూడాను; అందులో భాగంగానే క్రీస్తు ఈ లోకానికి రావటం, క్రీస్తుతో ఈ రక్షణ ప్రణాళిక పరిపూర్ణమైనట్లు, ఈ పరిపూర్ణమైన రక్షణలో క్రీస్తు ప్రజలను నడిపించేందుకు క్రీస్తు శిష్యులను ఏర్పాటు చేసి వారి ద్వారా, వారి తరతరాల ద్వారా, వారి స్థానంలో నేడు క్రీస్తు ప్రేరణతో ఆయన పిలుపునకు స్పందించి జీవితాలను ప్రభు సేవకు అంకిత మొనర్చుకొన్న అనేక గురువుల, మఠకన్యల ద్వారా క్రీస్తు తన రక్షణ ఫలాలను తన ప్రజలకు అందిస్తూ ఉన్నారు.

క్రీస్తు తన సేవకులను ఎన్నుకొనే ప్రక్రియ చాలా ప్రణాళికాబద్ధంగా ఉంటుంది. అందుకు ఉదాహరణలు మనకు చాలానే ఉన్నాయి. అయితే ఈ దేవుని ప్రణాళిక అనేది ఒక్కసారిగా సినిమా మాదిరిగా మనకు మొత్తం తెలియజేయబడదు. ఆయన ప్రణాళిక వివిధ దశలలో, వివిధ రూపాలలో తెలియజేయబడుతూ ఉంటుంది. ఇలా తెలియజేయబడటం అనేది మన స్పందనను బట్టి ఉంటుంది. ఎంత ఉదారంగా మనం ప్రభు చిత్తానికి, ఆయన ప్రణాళికకు స్పందిస్తామో అంతలోతుగాను, గొప్పగాను ఆయన ప్రణాళిక మనకు విశదమౌతుంది. ఇది దేవుని సేవకు పిలువబడిన వ్యక్తులకు మాత్రమే కాదు, ప్రతి దేవుని బిడ్డకు వర్తిస్తుంది. ఎందుకంటే ప్రతి మనిషి దేవుని ప్రణాళిక ప్రకారమే నడుచుకోవలసిన బాధ్యత. "మీ రాజ్యము వచ్చునుగాక, మీ చిత్తమే జరుగును గాక" అని చెప్పే పరలోకజప ప్రార్ధనలో దాగి ఉన్న నిగూఢ అర్థమే ఇది.

ఈ రోజు మనం దేవుడు పునీత లొయోలాపురి ఇన్యాశివారికి తన ప్రణాళికను వివిధ దశలలో ఎలా ఎరుకపరిచారు, ఇన్యాశివారు ఎలా స్పందించారు, ఆయన అనుభవాల పర్యవసానాలు ఏమిటి, వాటి ఫలాలేమిటి అనే విషయాలను తెలుసుకుందాం.

ఇన్యాశివారు తాను వ్రాయించిన తన "ఆత్మకథ"లో తన జీవితయాత్రలో దేవుడు తన్ను ఆయన ప్రణాళిక ప్రకారం ఎలా నడిపించారో చక్కటి క్రమంలో విశదీకరించారు. తన "ఆత్మకథ" మొదటి అధ్యాయం, మొదటి వచనంలో




ఇలా అంటారు, “తను ఇరువది ఆరేండ్ల వయస్సు వరకు ప్రాపంచిక వ్యవహరాలు, వ్యామోహంలో పడి, వీటి ద్వారానే ప్రపంచం మొత్తంలో కూడా కీర్తి ప్రతిష్ఠలు సంపాదించాలనే ఆశతోను, ఆశయంతోను, వాటికోసమే జీవించాడు”. కాని చివరి అధ్యాయం చివరి వచనాలలో ఇలా అన్నాడు. “తాను అన్నింటిలోనూ దేవుని చూడటం, దేవుని ప్రణాళికను తెలిసికోవటం, అన్ని దేవుని కీర్తి ప్రతిష్ఠలకోసం చేయడంలో పరిణతి చెంది జీవించాడు”. అంటే ప్రాపంచిక వ్యవహారాలు, వ్యామోహాలనుండి, దేవుని వ్యవహారాలు, దేవుని పనులమీదే దృష్టిసారించడం, అలాగే ప్రాపంచిక కీర్త ప్రతిష్ఠలకోసం పడినతపన నుండి దేవుని కీర్తి ప్రతిష్ఠలకోసమే అన్నట్లుగా ఇన్యాశివారి జీవనయాత్ర సాగింది. ఇంకా సరిగ్గా ఆయన మాటల్లోనే చెప్పాలంటే ఆయన జీవనయాత్ర దేవునిచే సాగించబడినది, నడిపించబడినది. “ఒక స్కూల్ విద్యార్థిని టీచరు చేయిపట్టి నడిపిస్తూ నేర్పించిన విధంగా దేవుడు నాకు నేర్పించాడు, నన్ను నడిపించాడు” అని ఇన్యాశివారు తన అత్మకథలో పేర్కొన్నారు. ఈ జీవనయాత్రలో దేవునికి, ఇన్యాశివారికి మధ్య జరిగిన కొన్ని ముఖ్య ఘట్టాలను స్మరించుకోవాలి. ప్రతి ఘట్టంలో కూడా మనం ఒక క్రమాన్ని చూడవచ్చు. 1. దేవుని ప్రణాళిక ఎరుకపరచబడటం. 2. దేవుని ప్రణాళికను ఇన్యాశివారు గుర్తించడం (Through discernment Process) (విషయపరిచ్ఛేదన ప్రక్రియ mostly, sometimes promptly) 3. నిర్ణయం తీసికోవటం. 4. ఆ నిర్ణయాన్ని దేవుడు రూఢిపర్చడం.

ఇదే ప్రక్రియలో నాలుగు ముఖ్యమైన విషయాలు కూడా చోటు చేసికొంటాయని మనం గమనించాలి. అవి 1. ఇన్యాశివారి జీవితంలోనికి దేవుని ప్రయాణం. 2. దేవుని వైపుకు, దేవునిలోనికి ఇన్యాశివారి ప్రయాణం. 3. ఇన్యాశివారు తనలోనికి తాను ప్రయాణం చేయటం. 4. నూతన సృష్టిలోనికి ఇన్యాశివారి ప్రయాణం. ఈ నాలుగు విషయాలు ఇన్యాశివారి ప్రతి అనుభవంలోను చోటు చేసికోవటం మనం గమనించవచ్చు.

**మొదటి ఘట్టం :** ఈ ఘటనలో ఇన్యాశివారి గురించి, ఆయన పరివర్తనకు దారి తీసిన పరిస్థితులను గురించి, క్లుప్తంగా తెలుసుకుందాము.

స్పెయిన్ దేశస్థుడైన ఇన్యాశివారు (‘ఇనిగో’ – ఆయన చిన్ననాటి జ్ఞానస్నాన నామం) 1491లో లొయోలా కుటుంబంలో బెల్‌ట్రాన్ ఐబనెజ్ డె ఓనెజ్ మరియు మరియ సాన్‌చెజ్ దే లెకోనా అను దంపతులకు పదియవసంతానంగా జన్మించాడు. లొయోలా కుటుంబీకులు సాధారణంగా క్రైస్తవ విశ్వాస ఆచారాలను క్రమం తప్పకుండా పాటిస్తూ ఇటు తిరుసభకు విశ్వాస పాత్రులుగా జీవిస్తూ, అటు తమరాజులకు వినయవిధేయులై అంకిత భావంతో రాజకుటుంబాలకు విశ్వాస పాత్రులుగా జీవించిన ఘనత కలిగి ఉండేవారు. కాని వారి నైతిక జీవితం మాత్రం క్రైస్తవ విశ్వాస విలువలకు విరుద్ధంగాను, అపకీర్తి కరంగాను ఉండేది. కనుకనే ఇనిగో (ఇన్యాశివారి చిన్ననాటి పేరు) తన 26వ యేట వరకు కూడా తన జీవితాన్ని అనైతిక కార్యకలాపాలతో, విలాసాలు, విందులు, వినోదాలు, బలపరాక్రమ ఆటలు, శృంగార పుస్తకాలు, శృంగార కార్యకలపాలతోను, తన కీర్తి ప్రతిష్ఠలే పరమావధిగా జీవించారు. ఈ విధంగా ప్రాపంచిక వ్యామోహాలలో, ఆశలలో, అత:పురకాంతల స్వప్నాలోకంలో విహరిస్తూ కాలంగడుపుతున్న సమయంలో, రాజుకు వినయ విధేయ సైనికుడిగా ఆయన ఆజ్ఞలకు బద్ధుడై 1521వ సంవత్సరంలో పాంపలోన దుర్గముపై దండెత్తి వచ్చిన ఫ్రెంచి సైన్యంతో వీరపోరాటం చేస్తున్న తరుణంలో శత్రుసైన్యం నుండి వచ్చిన ఒక ఫిరంగి గుండు ఇన్యాశివారి కాలికితగిలి ఆయన్ను కోలుకోలేని దెబ్బకొడుతుంది. తన జీవితానికి దేవుడిచ్చినటువంటి ‘క్రొత్తమలుపు’ ఇది అని బహుశా ఇన్యాశివారు ఆ



సమయంలో ఊహించలేదు దాదాపుగా చని పోయే స్థితిలో ఉన్న ఇన్యాశివారిని అద్భుత రీతిన పునీత పేతురుగారి ప్రార్థనవలన దేవుడు స్వస్థత పరచడం, ఇన్యాశివారు జీవించడం జరుగు తుంది. కాని ఇన్యాశివారు మాత్రం ఇంకా అదే ధ్యాసలో, ఊహాలోకంలోనే జీవిస్తున్నారు. దేవుని ప్రణాళికను గుర్తించలేదు.

**రెండవ ఘట్టం:** ఆరోగ్యం కుదుటపడినా, కాలికి తగిలిన బలమైన గాయాలవలన, మూడు సార్లు కాలికి ఆపరేషన్ చేయటంవలన, కదలలేక మంచంమీదనే కొన్ని దినాలు గడపాల్సి వచ్చింది. ఈ ఘటనలోనే కీలకమైన మలుపుచోటు చేసికొం టుంది. లొయోలా కొటలో తను విశ్రాంతి తీసికొంటున్న సమయంలో ఏమితోచక చదవటా నికి కొన్ని పుస్తకాలివ్వమని వారి వదినగారిని అడుగగా, ఆమె "క్రీస్తు జీవిత చరిత్ర" మరియు "పునీతుల జీవిత చరిత్రలు" అను రెండు పుస్తకా లను ఇన్యాశివారికివ్వగా మొదట్లో వాటిని త్రోసి పుచ్చినా, గత్యంతరం లేక ఆ పుస్తకాలనే అయి ష్టంగా చదవడం ఆరంభిస్తారు. కొద్దిసేపు ఇవి చదవడం, మరికొద్ది సేపు తన కలలరాకుమారిని గూర్చి ఆలోచించడం, యుద్ధగాథలు, విన్యాసాల గురించి ఆలోచించడం చేస్తూ ఉన్నారు. ఇలాగే కాలం గడుస్తున్న తరుణంలో తనలో కలుగుతున్న టువంటి ఒక గొప్ప పరిణామాన్ని ఇన్యాశివారు గుర్తిస్తారు. అదేమిటంటే, క్రీస్తు చరిత్ర, పునీతుల చరిత్రలు చదివినప్పుడు, చదివిన తరువాత సమ యంలో కూడా ఆయన మనస్సులో గొప్ప ఆనం దాను భూతికలగడం, అది చాలాసేపు కొనసా గడం, అదే ఆయన ప్రాపంచిక విషయాలు తలం చుకొన్నప్పుడు ఆయనలో కలిగిన సంతోషం, ఉత్సాహం కొంత సమయమైన తరువాత మాయమై విచారం, నిరాశ, నిస్పృహలు కల గడం గమనించారు. ఈ అనుభవం నుండి ఇన్యా శివారు "మనలో సదాత్మ, దుష్టాత్మ అను రెండు ఆత్మలు పనిచేస్తుంటాయని, వాటిని జాగ్రత్తాగా గమనిస్తూ సదాత్మకలిగించే ఆలోచనలపైనే మనస్సులను లగ్నంచేసికొని ఆ దిశలోనే మనం నడవాలని" తెలిసికొంటారు. ఈ ఆత్మలను వాటి ఆలోచనలను ఎలా పసిగట్టాలో తన దైవాను భూతి ద్వారా మనందరికి తాను వ్రాసిన ఆధ్యా త్మిక తపోభ్యాసాలు (The Spiritual Exercises) అనే గ్రంథంలో పొందుపరిచారు. దానినే "ద్వివిధ ఆత్మల వివేచనం" (Disce-




rnment of Spirits) అని అంటాము. ఈ విధంగా ఇన్యాశివారు తాను చికిత్స పొందుతున్న సమయంలో దేవుడు ఆయన పరివర్తనకు బీజం వేశాడు. "పునీత అసిస్సీపుర ఫ్రాన్సీస్ గారు, పునీత దోమినిక్ గారు దేవునికోసం అన్ని గొప్పకా ర్యాలు చేసినప్పుడు నేను మాత్రం ఎందుకు చేయ కూడదూ. వారికంటే గూడ ఎక్కువ చేయాలి" అనే తపనను దేవుని ఆత్మ తన మనస్సులో రాజేసింది. వెంటనే ఇన్యాశివారు ఈ లోక ఆశ లను, వస్తువులను, కుటుంబాన్ని అందర్నీ, అన్నిం టిని వదిలి పునీతులలాగానే "నేను కూడా క్రీస్తు కోసమే జీవిస్తాను. ఆయనకోసమే ఆయన సేవలోనే మరణిస్తాను" అని నిర్ణయించుకొని తన నూతన జీవిత యాత్రను ప్రారంభిస్తారు. అందులో భాగంగా ముందుగా యెరూషలేమును దర్శించుకొని, ఆ ప్రభు దీవెనలు, శక్తిని పొంది తన ప్రేషిత కార్యాన్ని మొదలుపెట్ట తలంచుకుం టారు. ఈ నిర్ణయం దేవుని చిత్తమే అని రూఢి చేస్తున్నట్లుగా ఆ రోజు రాత్రి ఇన్యాశివారికి దివ్య దర్శనం కలుగుతుంది. ఆ దివ్య దర్శనంలో మరియు తల్లి బాలయేసుని ఎత్తుకొని దర్శనమి స్తుంది. ఆదర్శనం ద్వారా ఆయన మనస్సులో దేవుడు గొప్ప ఆనందానుభూతిని కలుగజేసిన ట్లుగా ఇన్యాశివారు తన 'ఆత్మకథ' లో పేర్కొ న్నారు. అక్కడి నుండి ఇన్యాశివారు తన ప్రాపం చిక విషయాలకు స్వస్తిచెప్పి, తను జీవించిన పాపజీవితానికి పశ్చాత్తాపంగా ఘోరమైన, కఠినమైన తపస్సు క్రియలను చేయ నిశ్చయించి తన ప్రయాణాన్ని, యెరూషలేము వైపుకు పాద యాత్రగా మొదలిడుతారు. ఇప్పుడు ఆయనకు ప్రపంచం యెడల వున్న దృక్పథం కూడా మారడం మొదలౌతుంది.


**మూడవ ఘట్టం :** ఒక సారి ఇన్యాశివారు గాడిదపై ఇంకొక ఊరు ప్రయాణిస్తున్నప్పుడు మార్గ మధ్యంలో ఒక ముసల్‌మాను (ముస్లిం) సోదరుడు కూడతోడై ఇద్దరూ కలిసి ప్రయాణిస్తుం టారు. ఆ ప్రయాణంలో వారిరువురి మధ్య సంభా షణ మొదలై ఒకానొక సమయంలో మరియతల్లి కన్యత్వం విషయంలో ముస్లిం సోదరుడు ఇన్యాశి వారితో విభేదించి ఆమె కన్నెకాదు అన్నట్లుగా వాదిస్తాడు. ఇన్యాశివారు ఎంత ప్రయత్నించినా ఆయన్ని నమ్మించలేకపోతాడు. ముసల్‌మాను కొద్ది సేపటి తరువాత వేరేదారిలో తన ప్రయాణం కొనసాగిస్తాడు. కాని ఇన్యాశివారు మరియతల్లిని ఆ ముస్లిం సోదరుడు అవమానించి నందుకు బాధపడటమే కాకుండా, కోపం కట్టలుత్రెంచు కొచ్చి ఆ ముస్లిం సోదరుడ్ని చంపివేయాలని నిర్ణ యించుకుంటాడు. కాని దేవుడు కలిగించుకొని అతనిలో కలతను రేకెత్తిస్తాడు. అప్పుడు ఇన్యాశి వారు మనస్సులో "నేను ఇప్పుడు ఏంచేయాలో తొచడంలేదు. దేవుడే నాకు దారి చూపించాలి అని అనుకొంటుండగా ఆయన ప్రయాణించే మార్గంలో రెండు దారుల కూటమి వస్తుంది. అందులో ఒకదారిలో ముసల్‌మాన్ వెళ్ళాడు. అక్కడ తనగాడిద పగ్గాలను వదిలేసి, గాడిద కనుక ముసల్‌మాన్ తీసుకున్న దారిలో వెళితే నేను వెళ్ళి ఆ ముసల్‌మాన్‌ను చంపేస్తాను. ఇంకో దారిలో వెళితే నేను ఆయన్ను చంపడం దేవుని చిత్తం కాదు అని అనుకుంటాను అని తలంచాడు. గాడిద వేరే దారిలో వెళ్తుంది. దేవుని చిత్తం ఆ విధంగా బహిర్గతమయ్యింది ఇన్యాశివారికి.



**నాల్గవ ఘట్టం : మన్రేసా ఆధ్యాత్మిక అనుభవాలు :** ఇన్యాశివారు యెరూషలేమునకు వెళ్ళే ముందు మన్రేసా అనే ఊరిలో కొన్నిదినాలు ప్రార్ధనలో గడిపి వెళ్ళాలనుకొని మన్రేసా గ్రుహల్లో నిశ్శబ్ద వాతావరణంలో తన ద్యానాన్ని ఆరంభిస్తారు. కొన్ని దినాలు కాస్త కొన్ని నెలలు అయ్యాయి. దాదాపు 11 నెలలు మన్రేసాలోనే ఇన్యాశివారు సమయం తెలియకుండా ధ్యానంలో గడిపారు. ఈ 11 నెలల సమయంలో దేవుడు ఆయనకు ప్రత్యేకమైన దర్శనాలిచ్చి గొప్ప, లోతైన ఆధ్యాత్మిక అనుభూతుల్ని దయచేసి ఆయనను పూర్తిగ దేవుడు తనకు అనుగుణంగా మార్చేసుకొన్నాడు. తన ప్రణాళికలను అర్ధంచేసికొనే జ్ఞానాన్ని ఆయనకు ప్రసాదించి, ఆయనను తన శక్తితో నింపుకున్నాడు. మరిముఖ్యంగా కార్డినోర్ నది దగ్గర దేవుడు ఇన్యాశివారికి సంపూర్ణ జ్ఞానోదయాన్ని ప్రసాదించడం జరుగుతుంది. అప్పటి నుండి ప్రపంచాన్ని క్రొత్తగా దేవుని కళ్ళతో చూడటం, దేవుని మనస్సుతో అర్ధం చేసికోవడం ఆరంభించారు. ఈ మన్రేసా ఊరిలోనే తన అనుభవాలన్నింటిని కూర్చివాటిని Spiritual Exercises (ఆధ్యాత్మిక తపోభ్యాసాలు) గాను, తన ప్రతిరోజు అనుభవాల్ని Spiritual Dairy గాను, వ్రాసుకున్నారు. ఆ తరువాత యెరూషలేము పట్టణానికి వెళ్ళి ప్రభు తిరిగిన స్థలాలనన్నింటిని సందర్శించి ప్రభువుతో చాలా దగ్గర అనుబంధ అనుభవాన్ని, కృపను పొంది తిరిగి వస్తాడు.

**ఐదవ ఘట్టం : ఇన్యాశివారి చదువులు - సహచరులు :** దేవుని ప్రణాళిక ప్రకారం దేవుని పనిని చేయటానికి పై చదువులు అవసరమని తాను గ్రహించటం మరియు కొంతమంది మేధావుల సలహామేరకు పై చదువులు బార్సెలోన, ఆల్కాలాలలో లాంగ్వేజ్ స్టడిస్, సెక్యూలర్ స్టడిస్ పూర్తి చేసి, పారిస్‌లో దైవ శాస్త్రాభ్యాసాన్ని చేస్తారు. ఈ క్రమంలో తనతోపాటు కొంతమంది





సహచరులను సమకూర్చుకుంటారు. వారితో ఆధ్యాత్మిక అభ్యాసాలు చేయించడం, చదువులతో పాటు పిల్లలకు సత్యోపదేశం, ఇంకా ఇతర సేవా కార్యక్రమాలు చేస్తూ తమ అవసరాలను కావలసిన డబ్బుకోసం బిక్షాటన చేస్తూ పేదరికజీవితాన్ని కొనసాగించేవారు. జేసుసభ స్థాపనకు ఒక విధంగా ఇక్కడ పునాదిరాయి వేయబడిందని చెప్పవచ్చు.

**ఆరవ ఘట్టం : రోము నగర ప్రయాణం :** ఇన్యాశివారు తన సహచరులు కలిసి యెరూషలేము పట్టణానికి వెళ్ళి తమ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను ఆ పవిత్ర స్థలంలో కొనసాగించ తలచుకొంటారు. కాని కొన్ని కారణాల వలన వారు యెరూషలేమునకు పోలేకపోవటం వలన వారు రోము నగరానికి వెళ్ళి తమ్ముతాము పోపు గారికి సమర్పించుకోవాటానికి నిర్ణయించుకుంటారు. అంతకు ముందు వీరు ఒక గ్రూపుగా ఏర్పడి వెనిస్ నగరంలో పేదరికం, బ్రహ్మచర్యం వ్రతాలను తీసికొని తమ్ముతాము దేవునికి అర్పించుకోవటం జరుగుతుంది. ఆ తరువాత వారు రోము నగరానికి ఇద్దరుగా, ముగ్గురుగా ప్రయాణం చేయటం మొదలెడతారు. మార్గ మధ్యంలో రోము నగరానికి దగ్గర (లాస్టోర్టా) అనే స్థలంలోని ఒక చిన్న గుడిలో ఇన్యాశివారు ప్రార్థన చేస్తున్నపుడు ఒక అద్భుతమైన దైవానుభవం కలుగుతుంది. ఆ అద్భుత దృశ్యంలో తండ్రి దేవుడు ఇన్యాశివారిని తనకుమారుడైన క్రీస్తు ప్రక్కన ఉంచి మేము రోములో మీకు అనుకూలంగా ఉంటాము. అంటే మీరు అనుకున్నది జరిగేటట్లుగా చేస్తాము అని తండ్రి దేవుడు ఇన్యాశివారితో చెప్పడం జరిగింది. ఇది అక్షరాల రోము నగరంలో నిజం అవుతుంది. తమ్ముతాము పోపు గారికి సమర్పించుకొన్నప్పుడు కొన్నాళ్ళ తరువాత ఇన్యాశివారు ఆయన సహచరులు కలిసి జేసు సభగా ఏర్పడి తమ సేవలను అందించటానికి పోపు గారు తమ అంగీకారాన్ని తెలియజేయడం జరుగుతుంది. ఆ విధంగా 1540వ సం॥లో జేసుసభ స్థాపింపబడటం జరుగుతుంది. ఈ విధంగా ఇన్యాశివారు దేవుని ప్రణాళికకు ఉదారంగా స్పందిస్తూ, ఆధ్యాత్మిక అంతరాలలోకి పయనించి, దేవుని కేంద్రంగా జీవిస్తూ దేవుని కృపకు పాత్రుడై జీవించడం వలన దేవుడు ఆయనలో, ఆయన ద్వారా ఎన్నో అద్భుతాలు, గొప్ప కార్యాలు చేశారు. ఇప్పుడు కూడా జేసుసభ ద్వారా చేస్తున్నారు. అయితే మనం ఆలోచించాల్సిన, ధ్యానించాల్సిన అంశాలు:

1. మన ఆధ్యాత్మిక జీవితం ఎంతలోతైనది, ఎంతదృఢమైనది?

2. మన ఆధ్యాత్మిక జీవితం మనరోజువారి జీవితాన్ని ప్రభావితం చేస్తుందా, ఎలా?

3. మనలో పరివర్తన ఎందుకు రావటం లేదు? పరివర్తన అనుభూతులు ఏమైనా ఉన్నాయా?

4. మన జీవితంలో మనం దేనికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాము? ధ్యానించుకుందాం, దేవుని కృప కోసం ప్రార్ధించుకుందాం, ఇన్యాశివారి ద్వారా ప్రేరణ పొందుదాం. ఆమెన్.

తెలుగు కతోలిక పీఠాధిపతుల సమాఖ్య

# భారత చెరసాల పరిచర్య



**చెరసాల పరిచర్య:** "నేను చెరసాలలో ఉన్నప్పుడు నన్ను దర్శించితివి" (మత్తయి 25:36) అని యేసుక్రీస్తు పలికిన విధంగా " చెరసాలలో ఉన్నవారిని పరామర్శిస్తే అది ప్రభుని పరామర్శించినట్లే" అనే భావనతో చట్టరీత్య ఖైదీలుగా పరిగణించబడిన వారిని, వారి అంధకార శక్తుల నుండి మానసిక బలహీనతల నుండి బయటికి రప్పించడానికి **దైవప్రేరణతో, మానవతా దృక్పథంతో సందర్శించి సేవ చేయడమే చెరసాల పరిచర్య.**

అంత్యదినమున యేసుక్రీస్తు అడిగే ప్రశ్నలకు 'హా! ప్రభూ! మేము చేసితిమి' అని ధైర్యంగా చెప్పడానికి ఖైదీలకు కావలసిన కనీస సదుపాయాలను సమకూర్చడంతోపాటు వారి జీవితాలను మార్చడానికి, వారి కుటుంబ జీవితాన్ని మెరుగుపరచడానికి, వారికి నైతిక, ఆధ్యాత్మిక విలువలు బోధించడం, వివిధ విధాలుగా ప్రోత్సహించడంతో పాటు వారికి జీవనోపాధిని కల్పించడం కూడా జరుగుతుంది. **చాలామంది ఖైదీలు మన చెఱసాల పరిచర్య ద్వారా మారుమనస్సు గలవారై లబ్దిపొంది, దినదినాభివృద్ధి చెందుతూ ఇతరులకు ఆదర్శప్రాయులుగా జీవిస్తున్నారు.**

మన చెరసాల పరిచర్యలో ఇంకా అనేక మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొని ఎంతో మంది ఖైదీల నేరపూరిత తలంపులను, వారి జీవితాలను మార్చి శాంతియుత, నేరరహిత సమాజాన్ని స్థాపించే విధంగా దేవుని ప్రార్థిస్తూ సంకల్పబలంతో కృషిచేస్తూ ఉన్నారు.

**భారత చెరసాల పరిచర్య లక్ష్యాలు:**

– చెరసాలలో ఉన్న కతోలిక (కడప సెంట్రల్ జైలు) ఖైదీలకు ప్రతి ఆదివారం దివ్యపూజ సమర్పించి దేవ ద్రవ్యానుమానాల స్వీకరణకు సహాయసహకారాలు అందించడం.

– చెరసాలలోనున్న ఖైదీలకు మతపరమైన బేధం లేకుండా సర్వ మతాలలోని ఆధ్యాత్మిక, నైతిక విలువలను బోధించుట.

– పండుగ రోజుల్లో, జాతీయ పండుగ రోజుల్లో, ఇతర ప్రముఖ దినాలలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేసి ఖైదీలకు, చెరసాలలో ఉన్నామన్న భావన తొలిగించి సంతోషంగా, సహోదరత్వంతో ఉన్నామనే భావన రూపకల్పన చేయడం.

– చెరసాలలోనున్న ఖైదీలతో ముఖాముఖిగా సంభాషించి, వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, చెరసాలే వసుధైక కుటుంబమనే భావన తీసుకురావడం.

– చెరసాలలోనున్న ఖైదీలను ప్రోత్సహించి, ఆటలపోటీలను నిర్వహించి బహుమతులు ప్రధానం చేయడం. కర్నూలు జైలులో క్యారమ్స్, చెస్ బోర్డు, చెనీస్ చక్కర్ ఇవ్వడమైనది.

– చెరసాల పరిచర్య గురించి విచారణల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో అవగాహన కలిగించి చెరసాల పరిచర్య భాగస్వామ్యం కలిగి ఉండి సేవలను అందించుటకు ఆహ్వానించడం.

– విడుదలైన ఖైదీలను కర్నూలులోని పునరావాస కేంద్రానికి తీసుకెళ్లి వారికి ఉపాధి కల్పించుట.

– పోయిన సంవత్సరం కరోనా మహమ్మారి ప్రబలిన సందర్భముగా కర్నూలులోని ఖైదీల కుటుంబాలకు, విడుదలైన ఖైదీల కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, మాస్కులు, శానిటైజర్లు పంచడమైనది.

– ఖైదీల కుటుంబాలను పరామర్శించి వారి ఆసుపత్రి ఖర్చులకు, ఖైదీల పిల్లల చదువులకు సహాయం చేయడం.

– చెరసాల పరిచర్య చేసే కతోలిక మేత్రాసన సమన్వయకర్తలు, స్వచ్ఛంద కార్యకర్తలు, ఉజ్జీవకులను ప్రోత్సహించడానికి ఒకరి అనుభవాలు, అనుభూతులు, పరస్పర ప్రోత్సాహం పొందడానికి 'చెరసాల స్వరం" డిజిటల్ మాసపత్రికను నడిపించుట.

– చెరసాల పరిచర్య గురించి, వార్తల గురించి ఎప్పటికప్పుడు తెలియజేయడానికి సోషల్ మీడియాను ఉపయోగించుట.

**చెరసాల పరిచర్య సమావేశాలు మరియు కార్యక్రమాలు:**

– 2019 సం॥ జూన్ 1వ తేదీన భారత చెరసాల పరిచర్య రాష్ట్ర సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత 2019 సం॥ జులై 19వ తేదీ ఉదయం విజయవాడ పీఠం, గుణదల సాంఘిక సేవా సంస్థలో, నాటి కర్నూలు పీఠాధిపతులు, చెరసాల పరిచర్య అధ్యక్షులు మహా పూజ్య పూల ఆంతోని గారి అధ్యక్షతన దక్షిణ భారతదేశ ప్రాంతీయ సమావేశం నిర్వహించడమైనది.

– అదే రోజు మధ్యాహ్నం పూజ్య గురువు పసల తోమాస్‌గారి సారధ్యంలో ఆంధ్రప్రదేశ్

(తరువాయి భాగం 19వ పేజీలో...)





● ధారావాహిక

# పవిత్ర వివాహం - కుటుంబ జీవితం

## పరిశుద్ధ ఫ్రాన్సిస్ పోపుగారి భావాలు



**"పరిశుద్ధ వివాహం మన యెడల దేవుని ప్రేమకు ప్రతీకగా (icm) ఉన్నది". వివాహం ద్వారా దంపతులు దేవుని రూపం, పోలికలో ఉన్నారు. స్త్రీ, పురుషుడు ఒక్కొక్కరుగా కాకుండా ఇద్దరు కలిసి దేవుని పోలికలో ఉన్నారు. దేవుడు ప్రేమరూపుడై ఉన్నారు. దేవుడు మనతో చేసుకున్న ఒడంబడికను స్త్రీ పురుషుల మధ్య ఒడంబడికతో పోల్చవచ్చును. సృష్టిలో బహుసుందరమైన విషయం ఏమనగా మనం ప్రేమించుటకు సృష్టించబడ్డాము. ఈ ప్రేమ ద్వారా మనం దేవుని, దేవుని ప్రేమను ప్రతిబింబిస్తాము. వివాహ అంతస్తులో స్త్రీ పురుషులిద్దరు పరస్పరం ఇచ్చి పుచ్చుకొనుట ద్వారా కచ్చితమైన సహవాస జీవితం ద్వారా దేవుని ప్రేమను ప్రతిబింబిస్తారు.**


సంకలనం, అనువాదం :
**పూజ్య గురువు**
**యం. సాల్మన్‌రాజు**
జ్యోతిర్మయి డైరెక్టర్, సికింద్రాబాద్
సెల్ : 9849542657




**స్త్రీ,** పురుషులు వివాహ దివ్య సంస్కారాన్ని ఆచరించినప్పుడు వారి 'వివాహంలో దేవుడు ప్రతిబింబిస్తాడు'. అక్షయమగు తన ప్రేమను దాని లక్షణాలను వారి వివాహంలో ఉండేలా దేవుడు చూస్తారు. 'పిత, పుత్ర, పవిత్రాత్మల సంపూర్ణ ఐక మత్యం', వారి సహవాస జీవితం వివాహంలో కనిపిస్తుంది. **వివాహంలో 'ఇద్దరు వధూవరులను ఒకే జీవితం'గా దేవుడు తయారుచేస్తారు. పవిత్ర బైబిల్ గ్రంథంలో దీనినే 'ఒకే శరీరం'గా అను శక్తివంతమైన భావంతో తెలిపారు.** వివాహంలో స్త్రీ పురుషుల మధ్య ఐక్యత ఇంత గొప్పదని మనం గ్రహించాలి. ఒకటిగా కలిసి జీవించే వధూవరుల జీవితంలో దేవుని ప్రేమ ప్రతిబింబిస్తుంది. ఈ కారణంగానే పురుషుడు తన గృహాన్ని, తన తల్లి దండ్రులను విడిచిపెట్టి భార్యతో జీవింప వెళ్తాడు. ఆ విధంగా వారి బంధం చాలా పటిష్టంగా ఉంటుంది. దీనినే పవిత్ర బైబిల్ 'ఒకే శరీరం'గా జీవింతురని తెలిపింది (ఆది 2 :24).

వారి కుటుంబ జీవితంలో వధూవరులు వారి మానవ బలహీనతలను బట్టి ఎన్నో కష్టాలు ఎదు ర్కొంటున్నారు. అయినప్పటికీ 'దేవుని పునాది'గా చేసుకొని వారి వివాహ బంధాన్ని కాపాడుకుంటు న్నారు. ప్రార్థన జీవితం ద్వారా వీరి బంధం ఇంకా ఎక్కువగా దృఢపరచబడుతుంది. **భార్యాభర్తలు ఒకరికోసం ఒకరు ప్రార్థన చేసినపుడు వారి బంధం మరింత దృఢపరచబడుతుంది.** కుటుంబ జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురవుతాయి. సరైన పని లేకపోవడం, చేతిలో డబ్బులు లేకపోవడం, పిల్లల సమస్యలు మొదలగు ఎన్నో సమస్యలు వస్తుంటాయి. కొన్నిసార్లు భార్యాభర్తలిద్దరు పరస్పరం వాదించుకుంటారు. కొన్నిసార్లు ప్లేట్లు, గ్లాసులు గాలిలో లేస్తాయి. ఈ విషయమై మన స్తాపపడవద్దు. ఇటువంటిదే మానవ పరిస్థితి. అయినా వధూవరుల మధ్య దేవుడు ఏర్పాటు చేసిన ఐక్యతా బంధం, ప్రేమ, గొడవలు, తగ వులు కన్నా గొప్పది. వధూవరులిద్దరు ఒకరిపట్ల మరొకరు ఈ పరిస్థితిలో ఒక బుజ్జగింపు, ఒక ముద్దు మురిపెం, ఒక ప్రేమతో కూడిన లాలన చేస్తే భాగస్వామిలో మార్పు తెస్తుంది. **ఈ రోజున కసురుకున్నా, అలకబూనినా, నీ జీవిత భాగ స్వామి కొంత సమయం తర్వాత తప్పక అర్థం చేసుకుంటుంది. జీవితమంటే ఇదే. ధైర్యంతో ముందుకు సాగాలి.** జీవించాలనే ఆశ మనిషిని ముందుకు నడిపిస్తుంది. నిజంగా ఇది గొప్ప విషయం. బహు సుందరమైన విషయం – (జన రల్ ఆడియన్స్, ఏప్రిల్ 2, 2014)

**జ్ఞాన వివాహాన్ని నూత్నీకరించుకొనుట:** పరి శుద్ధ వివాహం నుండి పవిత్ర కుటుంబం ఏర్పరచ బడుతుంది. వివాహం ఒక దివ్య సంస్కారంగా కుటుంబానికి పునాది అవుతుంది. దీని ద్వారా దంపతులు ఐక్యమత్యంలో దృఢపరచబడి, జీవిత భాగస్వాములుగా ఒకరికి ఒకరు స్వీయకానుకగా సమర్పించుకుంటారు. ఆ విధంగా క్రైస్తవ దంప తులు ఈ దివ్య సంస్కారానికి సాక్ష్యమిస్తారు. ఈ దివ్య సంస్కారంలోనే దంపతులు తమనుతాము కనుగొంటారు. భాగస్వామితో సత్సంబంధం ద్వారా వివాహాన్ని అర్థం చేసుకుంటారు. ముఖ్యం గా "ఇచ్చుట, స్వీకరించుటలో వీరి ప్రేమబంధం ద్వారానే ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటారు. **దంపతుల కుటుంబ ప్రేమ ద్వారా ప్రేమే దైవపిలు పుగా, పలు శోధనలు, త్యాగాలు, సంక్లిష్ట పరిస్థి తుల ద్వారానే వారు తమ ప్రత్యేక బంధాన్ని గ్రహి స్తారు.** వివాహంలో దంపతులు సంపూర్ణంగా ఎటువంటి షరతులు లేకుండా సమర్పించుకుం టారు. దైవకటాక్షంలో నమ్మికతో కష్టసుఖాలు, వారికున్న సద్గుణాలు పరస్పరం పంచుకుం టారు. ఇట్లాంటి అనుభవాలను యవ్వన దంప తులు వీరి తాతయ్య, నానమ్మ, అమ్మమ్మల నుండి నేర్చుకుంటారు. వివాహ నిశ్చితార్థం చేయబడే, చేయబడి వివాహ వ్యవస్థలో ప్రవేశించాలని ఆశిస్తున్న యువతీ యువకులారా! మీరు కలిసి జీవించాలని సిద్ధపడుతున్నారు. మీ గృహాన్ని నిర్మించుకోవాలని, కలిసి ఎదగాలని ఆశిస్తు న్నారు. **మీరు మీ జీవితాన్ని భావోద్వేగాలనే ఇసు కపై నిర్మించాలనుకుంటున్నారా? లేక దేవుని నుండి జనించిన నిజమైన ప్రేమ అనే రాతిపై నిర్మించాలనుకుంటున్నారా?** కుటుంబం దేవుని ప్రేమ ప్రణాళిక నుండి ఉద్భవించినది. గృహం ఏ విధంగా ఆప్యాయతానురాగాలు, పరస్పర సహ కారం, నిరీక్షణ, మద్దతుపై నిర్మించబడుతుందో, కుటుంబాలు కూడా అట్లే నిర్మించబడుతాయి. **దేవుని ప్రేమ శాశ్వతమైనది, నిత్యమైనది కనుక కుటుంబం కూడా ఈ శాశ్వతమైన, నిత్యమైన ప్రేమబంధంపై నిర్మించబడాలి.** తాత్కాలికంగా

నాకు ఏది లాభదాయకమో, ఏది ఉపయో గకరమో అదే ఒప్పు అనే తప్పుడు Culture of provisory (Culture of Temporary) సంస్కృతి నుండి దూరంగా ఉండాలి.

– (వివాహ నిశ్చితార్థం జరిగిన యువతీ యువకులకు సందేశం, ఫిబ్రవరి 14, 2014)

**మా అనుదిన ప్రేమను మాకు దయచేయండి:**

'జీవితాంతం కలిసి జీవించాలనే' ఆలోచన 'కొందరిని భయపెడుతుంది. ఈ ఆధ్యాత్మిక యాత్రను చిన్న చిన్న భాగాలుగా చేసి వాటిని ప్రభువుకు అప్పగిస్తే, ఆ భయం పతనమైపో తుంది. విశ్వాసంలో పరిణితి చెందిన స్త్రీ పురు షులుగా వారు జీవించినప్పుడు ఆ భయం అంత మైపోతుంది. "జీవితాంతం కలిసి జీవించాలి" అనే దానిలో మనం చూడవలసింది కాలాన్ని కాదు. ఎలాగోలాగున నెట్టుకొస్తే అది విజయవం తమైన వివాహం కానేరదు. ఫలభరితమైన జీవి తాన్ని జీవించాలి. **జీవితాంతం కలిసిమెలిసి ఉంటూ, ఒకరినొకరు నిత్యం ప్రేమించుకొను టయే క్రైస్తవ దంపతులకు ఒక సవాలు** అని చెప్పవచ్చు. 5000 మంది ఆహారంలో ప్రభువు రొట్టెలను ఏ విధంగా నూరంతలుగా సమృద్ధిలోకి తెచ్చారో, అదే విధంగా ప్రభువు మీ ప్రేమను సమృద్ధిపరిచి, నిత్యనూతన, అపార ప్రేమ మీ జీవితంలో క్రుమ్మరిస్తారు. ప్రభుని వద్ద అపార మైన, అంతులేని ప్రేమ నిల్వలు ఉన్నాయి. మీ దంపతుల జంటను ఒకటిగా దృఢపరుస్తూ, ఐక్య పరుస్తూ, ప్రేమే మీ దాంపత్యజీవిత పునాదిగా ప్రభువు దయచేస్తారు. మీకు సంతానం కలిగి, వారు ఎదుగుతూ అభివృద్ధి చెందుతుంటే ప్రభువు మిమ్ము ఇంకా అధికంగా దీవిస్తారు. ఈ ప్రేమ ప్రయాణంలో మీకు ప్రార్థన చాల ముఖ్యం. ఇది చాల అవసరమై ఉంది. భర్త భార్యకోసం, భార్య భర్తకోసం, ఇరువురు కలిసి ఒకరికోసం ఒకరు ప్రార్థన చేయాలి. అడిగితే ప్రభువు మీకు ప్రేమను సమృద్ధిగా దయచేస్తారు. ఈ కారణంగా **"పర లోక ప్రార్థన"లో "నానాటికి కావలసిన మా అన్నం మాకు దయచేయండి"** అని **ప్రార్థిస్తూనే, జీవిత భాగస్వాములు "నానాటికి కావలసిన మా ప్రేమను మాకు దయచేయండి" అని ప్రార్థిం చాలి.** వారి అనుదిన ప్రేమ, వారికి అనుదిన ఆహారం. ప్రేమతో ముందుకు కొనసాగే వారి ప్రయాణంలో వారిని నిలదొక్కుకునేలా చేసి, వారి ఆత్మకు ఆహారమౌతుంది. ఈ ప్రార్థన వివాహ నిశ్చితార్థమైన, కాబోయే దంపతులు, వైవాహిక జీవితాన్ని జీవిస్తున్న దంపతుల ప్రార్థనగా మారాలి. **ప్రభువా మేము ఒకరిని ఒకరు ప్రేమించేలా, ఒకరి చిత్తాన్ని మరొకరు అర్థం చేసుకునేలా, ఒకరిపై ఒకరు నమ్మకం, విశ్వాసం ఉంచేలా, ఒకరిని ఒకరం నిత్యం ప్రేమించేలా మమ్ము దీవించండి.** ఆ రీతిగా మా జీవిత కష్టాలను మేము ఎదుర్కొనగలం అని భార్యాభర్తలు ప్రార్థించాలి.

– (వివాహం నిశ్చయమైన యువతీ యువకులకు సందేశం, ఫిబ్రవరి 14, 2014)

----------

Give Us This Day our Daily Love -- Pope Francis on the family నుండి పై భావాలు గ్రహించడమైనది.

## ధ్యాన ప్రార్థన.. ప్రేమకు మార్గదర్శి..



భగవంతుని గురించి ధ్యానిస్తూ చేసే ధ్యాన ప్రార్థన మనలోని ప్రేమను రగిలిస్తుందని పోప్ ఫ్రాన్సిస్ అన్నారు. బుధవారం జనరల్ ఆడియన్స్ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలుచేశారు. ప్రకృతితో కలసి మనం ధ్యాన ప్రార్థన చేయగలగడం నేర్చుకోవాలన్నారు. ధ్యాన ప్రార్థన అంటే అదో కార్యక్రమం కాదని, జీవితశైలిలో అదో భాగమని పేర్కొన్నారు. తద్వారా మనం దేవునితో బంధంలో పాలుపంచుకోగలమని అన్నారు. ధ్యానం ద్వారా పలు కోణాల నుంచి వాస్తవాలను చూడొచ్చని అన్నారు.

( 17వ పేజీ తరువాయి...)

రాష్ట్ర ప్రాంతీయ సమావేశం పాలక సంఘ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.

– 2019 సం. నవంబర్ 29న కర్నూలులోని జీవసుధ పాస్టల్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ సర్వసభ్య సమావేశం నిర్వహించడమైనది. ఈ సమావేశంలో నాటి కర్నూలు పీఠాధిపతులు, తెలుగు శ్రీ సభ ప్రాంతీయ భారత చెరసాల పరిచర్య అధ్యక్షులు మహా పూజ్య పూల ఆంతోని గారు, చెరసాల పరిచర్యలో ఎదుర్కొంటున్న సవాళ్ళను అధిగమించడానికి, సమస్యలను పరిష్కరించడానికి తాను ఎప్పుడు ముందుంటానని భరోసా ఇచ్చారు.

– 2019 డిసెంబర్ 8న నాటి కర్నూలు పీఠాధిపతులు, తెలుగు శ్రీ సభ ప్రాంతీయ భారత చెరసాల పరిచర్య అధ్యక్షులు మహా పూజ్య పూల ఆంతోని గారి సారధ్యంలో కర్నూలులోని జీవసుధ పాస్టల్ సెంటర్‌లో నిర్వహించిన 'శాంతాక్లాజ్ డాన్స్' పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానం మరియు పాల్గొన్న ప్రతి ఒక్కరికి క్రిస్మస్ కానుకలను బహుమతిగా అందించడం జరిగింది.

– కర్నూలు పీఠంలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో భాగంగా 2019 డిసెంబర్ 19న కర్నూలులోని మహిళల కారాగారాన్ని, 2019 డిసెంబర్ 22న పురుషుల కారాగారాన్ని తెలుగు శ్రీ సభ ప్రాంతీయ భారత చెరసాల పరిచర్య అధ్యక్షులు మహా పూజ్య పూల ఆంతోని గారు, ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ చెరసాల పరిచర్య సమన్వయకర్త పూజ్య గురువు పసల లహస్త్రాయ మరియు స్వచ్ఛంద కార్యకర్తలతో సందర్శించి, క్రిస్మస్ వేడుకలను నిర్వహించి, క్రిస్మస్ కేక్ కట్ చేసి ఖైదీలకు, జైలు అధికారులకు పంచి, క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

**చివరిగా:** చెరసాలలో అమాయకులుగా, అనామకులుగా, అన్యాయంగా మగ్గిపోతున్న ఖైదీలందరికి మారుమనస్సు, హృదయపరివర్తన, నూతన జీవితంతో పాటు పునరుద్ధరణ, పునరావాసం ఎంతో దోహదపడుతుంది.

పాపాన్ని ద్వేషించాలి. పాపిని ప్రేమించాలి. దేవుడు పాపి పరివర్తననే కోరుకుంటాడుగాని నాశనాన్ని కోరడు. కాబట్టి ఖైదీలను ప్రేమిద్దాం. ఖైదీలూ దేవుని బిడ్డలే.

**పూజ్య గురువు పసల లహస్త్రాయ**, భారత చెరసాల పరిచర్య రాష్ట్ర సమన్వయకర్త
బిషప్స్ హౌస్, బి–క్యాంప్, కర్నూలు, ఆంధ్రప్రదేశ్. మొబైల్: 9849734425

( 12వ పేజీ తరువాయి...)

ఆత్మ తండ్రి కుమారుల వాగ్దత్త ఫలము. కతోలిక శ్రీ సభ సత్యోపదేశం ఈ విధంగా బోధిస్తుంది. క్రీ.శ. 381 సం॥లో కాన్‌స్టాంటినోపుల్‌లో జరిగిన రెండవ మహాసభలో పవిత్రాత్మను గురించిన అపోస్తళ్ళ విశ్వాసాన్ని ప్రకటించింది. తండ్రి నుండి బయలుదేరెడు ప్రభువును, జీవతాంతం పవిత్రాత్మను విశ్వసిస్తున్నాం. ఈ విశ్వాస ప్రకటన ద్వారా శ్రీ సభ "దైవిక భావానికి మూలం, జన్మ స్థానం" తండ్రియని గుర్తించింది కాని కుమారుని పుట్టుక, ఆనాది నుండి పవిత్రాత్మ పుట్టుక రెండూ ఒకదానికొకటి సంబంధం లేని అంశాలు కావు. **త్రిత్వంలో మూడవ వ్యక్తి పవిత్రాత్మ కూడ దేవుడు. తండ్రితో, కుమారునితో సరిసమానుడాయన.** సమాన తత్వం, సమాన స్వభావం కలవాడు. అయినా ఆయన్ని కేవలం తండ్రి ఆత్మ అని వ్యవహరించడం లేదు. తండ్రి కుమారుని ఇరువురి ఆత్మ అని వ్యవహరిస్తున్నాం. కాన్‌స్టాంటినోపుల్ మహాసభ నుంచి గ్రహించి, విశ్వాస సంగ్రహంలో శ్రీ సభ తన విశ్వాసాన్ని ఇలా ప్రకటిస్తోంది. ఇతడు తండ్రి కుమారులతో సహా ఆరాధన, మహిమ అందుకొంటున్నాడు.

కావున పవిత్రాత్మ తండ్రి కుమారుల ప్రేమ బంధం. త్రిత్వమూలం మూడవ వ్యక్తి అయిన పవిత్రాత్మా దేవుడే. **అంతమాత్రాన ముగ్గురు దేవుళ్ళు కాదు కాని ఒకే దేవుడు. ఇది విశ్వాసము, దైవ రహస్యం.**

**త్రిత్వం :** ఇది ఒక సిద్ధాంతం, మనం నమ్మి విశ్వసించవలసిన ఒక సత్యం. "త్రిత్వం ఒక్కరే, దేవుళ్ళు ముగ్గురని మనం నమ్మడం లేదు. దేవుడు ఒక్కడే. ఆయనలో వ్యక్తులు మాత్రం ముగ్గురున్నారని నమ్ముతున్నాం. "ఒకే దైవిక తత్త్వంలో త్రిత్వం" ఉందని దీని భావం. దైవత్వంలో ముగ్గురు దివ్య వ్యక్తులు పాలుపంచుకొనరు. వారిలో ఒక్కొక్కరు సంపూర్ణంగా దేవుడు కుమారుడు ఏమిటో తండ్రి అదే, తండ్రి ఏమిటో కుమారుడు కూడ అదే. పవిత్రాత్మ ఏమిటో తండ్రి కుమారుడు కూడ అదే. అనగా నైసర్గికంగా ఒకే దేవుడు. వాటికను నాలుగవ సభ (క్రీ.శ. 1215). మాటల్లో ముగ్గురు దివ్య వ్యక్తుల్లో ప్రతి దివ్య వ్యక్తి సర్వోన్నత సత్యం. అనగా దివ్య సత్యం, దివ్య నైజం లేదా తత్వం ఒకటేనని భావం.

క్రైస్తవం ప్రారంభం నుండి బయలుపరచబడిన సత్యం త్రిత్వం. ఈ సత్యం శ్రీ సభ విశ్వాసమయ జీవనానికి మూలాధారంగా ఉంటుంది. **ముఖ్యంగా జ్ఞానస్నాన సంస్కారం ఈ సత్యానికి దివ్యసాధనంగా ఉంటూ వచ్చింది.** జ్ఞానస్నాన విశ్వాస నియమంలో, సిద్ధాంతీకరించిన ఉపదేశాల్లో, సత్యోపదేశంలో, శ్రీ సభ ప్రార్థనలో నిర్దిష్ట రూపం దాల్చింది. అపోస్తళ్ళ లేఖల్లో ఇలాంటి సూత్రాలు తొలినాటి నుంచే కనిపిస్తాయి. ప్రార్థన ప్రారంభంలో గురువు చేసే అభివాదం ఇలాంటి సూత్రాల్లో ఒకటి. యేసు క్రీస్తు కృప, దేవుని ప్రేమ, పవిత్రాత్మ సహవాసం మీ అందరికి కలుగును గాక. ఈ దివ్య సత్యాన్ని విస్పష్టంగా వివరించేందుకు తొలి మహాసభలు విశేషంగా కృషి చేసాయి. పితృపాదుల వేదాంత రచనలు ఇందుకు గొప్పగా తోడ్పడ్డాయి.

త్రిత్వం విశ్వాస సత్యం దేవుడు మానవులతో ఉన్న సంబంధాన్నే బయల్పరచు సత్యం. ఒకే దేవుడు, ఒకే విశ్వాసం, ఒకే జ్ఞానస్నానం. పిత దేవుడు, పుత్రుడు దేవుడు, పవిత్రాత్మ దేవుడు కాని మనం పూజించు, ఆరాధించు, మహిమ పరచు దేవుడు ఏక త్రిత్వ దేవుడు. ఆ దేవునికి ఎల్లవేళల మహిమ, వైభవం, ఘనత, ఆరాధన కలుగును గాక.

## భారతమిత్రానికి రూ. 25,000 ఆర్థిక సాయం




నల్లగొండ పీఠానికి చెందిన పూజ్య గురువు మాదాను ఫ్రాన్సిస్ గారు గొప్ప మనసుతో భారతమిత్రం పత్రికాభివృద్ధి కోసం విరాళంగా రూ. 25,000 ఆర్థిక సాయం చేసారు. ఒక రచయితగా ఫాదర్ గారికి భారతమిత్రంతో చక్కని అనుబంధం ఉంది. ఆదివారం ప్రసంగాలు, అనేక ప్రత్యేక సందర్భా లలో వేదాంతపరమైన చక్కని వ్యాసాలను అందించారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా భారతమిత్రం పత్రికాభివృద్ధి కోసం తమవంతు బాధ్యతగా మంచి మనసుతో స్పందించి ఉదారంగా సహాయం చేసినందుకు భారతమిత్రం ఫాదర్ గారికి తరుపున హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.

## పోప్ మే నెల ప్రార్థనా విన్నపం



మే నెలలో ప్రార్థించాల్సిన విన్నపం గురించి పోప్ వివరించారు. ఈ నెలలో క్రైస్తవులంతా ప్రత్యేకించి ప్రపంచ ఆర్థిక స్థితి గురించి ప్రార్థన చేయాల్సిందిగా ఆయన కోరారు. నిజమైన ఎకానమీ అనేది కష్టాల్లో కూడా అవకాశాలను సృష్టిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత మహమ్మారి పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలితే అత్యంత ప్రభావితమయ్యేవారు పేదలేనని ఆయన చెప్పారు. అందువల్ల ఆర్థిక పరిస్థితులు నిలకడగా ఉండేలా ప్రార్థించాలని ఆయన కోరారు. మే మాసం మరియతల్లికి కేటాయించినందున మరియతల్లి మధ్యవర్తిత్వం కోరాలని పిలుపునిచ్చారు.

## ప్రపంచంలోకెల్లా వృద్ధ బిషప్ కన్నుమూత



104 సంవత్సరాల వయసుతో ప్రపం చంలోకెల్లా అత్యంత వృద్ధ బిషప్‌గా పని చేస్తున్న ఫిలిపోస్ మార్ క్రిసోస్తమ ఈ నెల 5న కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత సమస్యలతో ఆయన మరణించినట్లు వైద్యులు తెలిపారు. కేరళకు చెందిన ఈయనకు భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పద్మ భూషణ్ అవార్డును కూడా అందించింది. రెండో వాటికన్ సమావేశంలో ప్రొటెస్టెంటు పరిశీలకుడిగా ఆయన పాల్గొన్నారు. 1917లో జన్మించిన ఆయన 67 సంవత్సరాల, 11 నెలల, 11 రోజుల పాటు బిషప్‌గా పని చేశారు.



# పరిచర్య సేవ అందరి బాధ్యత


**భాగస్వామ్య శ్రీ సభ అందని ఆకాశమా? : 20వ భాగం**


పూజ్య గురువు

**తైనీస్ అల్ఫోన్స్**

కడప పీఠం

సెల్ : +13375201075

**ఒ**క స్థానిక శ్రీ సభలో సామాన్య క్రైస్తవులు సహవాసం సాంగత్య జీవిత ఆనందాన్ని అనుభవ పూర్వకంగా ఆస్వాదించే అనుగ్రహాన్ని పొందుతారు. ఇది ప్రతి క్రైస్తవునికీ ఒక ప్రత్యేకమైన హక్కు. క్రీస్తు పట్ల విశ్వాసాన్ని పొందడం అనేది ఒక దైవ పిలుపు. ఈ పిలుపును వారు రెండు విధాలుగా పొందుతారు. ఒకవైపు శ్రీ సభలోను, మరోవైపు సమాజంలోనూ, వారి సహవాస సాంగత్యం కొనసాగాలి. **సామాన్య క్రైస్తవులు కేవలం అభిషిక్తులైన గురువుల నుండి అనగా మత గురువర్గం నుండి ఆదేశాలను వినడం, వాటిని నెరవేర్చడం అనే పాత సాంప్రదాయక పాత్రలో మార్పు రావాలి.** ఈ దిగువస్థాయి దృక్పథం నుండి బయటికి రావాలి. కేవలం అది మాత్రమే వారి కర్తవ్యం కాదు. దానికే వారు పరిమితం కాకూడదు. వారు స్థానిక శ్రీ సభలోనూ నాయకత్వ బాధ్యతలను స్వీకరించి, సమాజంలో సువార్తకు సాక్షం పలకాలి. లేకపోతే వారి పాత్ర అనేది కేవలం సారంలేని, లోతులేని, పైపై బాహ్యరూపంగా ఉపరితల స్థాయిలో మాత్రమే ఉండిపోతుంది. కనుక సామాన్య క్రైస్తవులు తమ పిలుపు ద్వారా పొందిన సేవా కర్తవ్యాన్ని ఇటు శ్రీ సభలోనూ, అటు శ్రీ సభ వెలుపల కూడా చక్కగా నిర్వర్తించినపుడే శ్రీ సభ ప్రేషిత సేవాకార్యాల్లో, కర్తవ్యదీక్షలో వారు భాగస్వాములుగా, సహకారులుగా, సహ కార్యదర్శులుగా రూపొందుతారు. అదే ద్వితీయ వాటికన్ మహాసభ కన్న కల.

**శ్రీ సభ పరిచర్య – సేవలపై పలు భావనలు :** ద్వితీయ వాటికన్ మహాసభ బోధనల ప్రకారం, బాప్తిస్మం స్వీకరించిన ప్రతి ఒక్కరూ స్థానిక శ్రీ సభ సేవా పరిచర్యలపట్ల బాధ్యత కలిగి ఉంటారు. "మినిస్ట్రీ" అనే ఆంగ్లపదం "మినిస్ట్రియం" అనే లాటిను పదం నుండి వచ్చింది. అంటే "ప్రయోజక సేవ" అని అర్థం. ఈ 'సేవ' అనే పదం లౌకికంగా, మతపరంగా వివిధరకాల అర్థాలను సూచిస్తుంది. లౌకిక పరమైన వాడుకలో ఇది ఒక దేశం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నిర్వహించే సేవలకు చెందిన మంత్రాంగ వ్యవస్థ లేదా అధికార మంత్రివర్గం, అలాగే విదేశాంగ వ్యవహారాల నిర్వహణ యంత్రాంగాన్ని, రాయబారి సంబంధిత ప్రాతినిధ్య సేవలను కూడా సూచిస్తుంది. ఆ విధంగా ఆయా సేవావిభాగాలను మినిస్ట్రీ అని వాటిని అధికారికంగా పర్యవేక్షించే వ్యక్తిని మినిష్టర్ అని పిలుస్తారు. ఇక **మతపరమైన వాడుకలో ఇది కొన్ని రకాల ప్రత్యేక మతసేవలను, వాటిని అందించే వ్యక్తిని సూచిస్తుంది. ఈ పదం మతపరమైన ఉపయోగం నూతన నిబంధన నుండి సంగ్రహించబడింది.** అపోస్తులుల కార్యాల్లో ఇది స్పష్టంగా కన్పిస్తుంది. తొలినాటి క్రైస్తవ సమాజంలో వివిధ రకాల సేవలను వివరించేందుకు 'డయకొనియ' (DIAKONIA) అనే గ్రీకు పదాన్ని వాడారు. దానిని ఆంగ్లంలో "డీకను" అని అంటారు.

ద్వితీయ వాటికను మహాసభకు ముందు మినిష్టర్ (పరిచారకుడు) అనే పదాన్ని సాధారణంగా ప్రొటెస్టెంట్ చర్చిల్లోని మత బోధకుల లేదా మతాధికార సభ్యునికి ఆపాదించబడింది. అదే సమయంలో **రోమన్ కతోలిక, ఆర్థడాక్స్ చర్చిలలో దివ్యబలి పూజార్చనను నిర్వహించే అభిషిక్తుణ్ణి గుర్తించేందు "గురువు" అనే పదం సాంప్రదాయకంగా వినియోగంలోకి వచ్చింది.** కతోలిక సంప్రదాయంలో సాధారణ, ప్రత్యేక సందర్భంలోని అసాధారణ సేవలను అందించే వ్యక్తుల మధ్య వ్యత్యాసాన్ని తెలిపేందుకు మినిష్టర్ (పరిచారకుడు) అనే పదాన్ని ఉపయోగించారు. ఉదాహరణకు సాధారణంగా ధ్రువీకరణ సంస్కారాన్ని పీఠాధిపతి నిర్వహిస్తారు. అయితే కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అసాధారణ రీతిలో తగిన అర్హత, అధికారం కలిగిన గురువు కూడా నిర్వహించవచ్చును. ఈ రెండు సందర్భాల్లో పరిచర్య ఒకటే అయినా నెరవేర్చేవారు వేర్వేరు

వ్యక్తులు అవుతారు. **శ్రీ సభ చరిత్రలో జరిగిన పలు సంస్కరణలు, మార్పులు కారణంగా పరిచర్య లేదా పరిచారికుడు అనే పదం వివిధ రకాల సేవా రూపాలను ప్రతిబింబిస్తోంది.**

పరిచర్య అనేది వాస్తవానికి క్రీస్తు, ఆయన ఆత్మ ద్వారా లభించే వరదీవెన, కానుక. అయినప్పటికీ పరిచర్య అనేది ఒక విధంగా సమాజం నుండే జనిస్తుంది. అంటే ఒక సంఘం లేదా సమాజం దేవుని నుండి పరిచర్యను పొందుతుంది. అదే సమయంలో ఒక సంఘం తన సంఘసభ్యుల శ్రేయస్సుకోసం తానే స్వయంగా పరిచర్యలను నిర్వహిస్తుంది. ఈ భావం ఆది శ్రీ సభలో మొదట డీకన్ల నియామకం లేదా ఏర్పాటు జరిగిన సందర్భం ద్వారా స్పష్టంగా అర్థమవుతుంది (అపో.కా. 6:1-6). అక్కడ **ఆనాటి స్థానిక సంఘం తన సంఘంలోని వితంతువుల యెడల పాటించవలసిన పరిచర్య అవసరతను గుర్తించి, డీకన్ల వ్యవస్థను ఏర్పాటుచేయడం ద్వారా సత్వర సత్ఫలితాలను పొందింది.** ఈ విధంగా ఒక స్థానిక సంఘం తన వివిధ పరిచర్యల ద్వారా ఆ సంఘం పట్ల తన కర్తవ్యాన్ని నెరవేర్చుతుంది. అందువలన శ్రీ సభ పరిచర్యలో సామాజిక దృక్కోణం ఎప్పటికీ ఉంటుంది. ఒక సమాజానికి కేవలం ఒకేఒక్క పరిచర్య లేదా సేవావిభాగం మాత్రం చాలదు. పరిచర్య అనే పదంలో సామాజిక కోణం ఉంటుంది కాబట్టి ఒక సంఘానికి ఒకే విధమైన పరిచర్యనే గాక అనేక విధాలైన పరిచర్యలు అవసరమౌతాయి. కనుక శ్రీ సభ పరిచర్య అని అనేకన్నా శ్రీ సభ పరిచర్యలు లేదా సేవలు అని సంబోధించడం సబబుగా ఉంటుంది. కర్తవ్యం ఒకటే కానీ సేవలు అనేకం.

పరిచర్య అనేది క్రీస్తే సమాజానికి అందించే సేవ. అదే సమయంలో క్రీస్తు ప్రేషిత కార్యాన్ని నెరవేర్చడంలో ప్రపంచానికి సంఘం అందించే సేవలే పరిచర్యలు. దీనినే క్రీస్తు పరిచారిక సేవలు అని అనవచ్చును. కనుక ఒక స్థానిక శ్రీ సభ తన దృష్టిని ఎల్లప్పుడూ సమాజంపై కేంద్రీకరించి ఉంచాలి. డి -బోరోబియో అనే వేదాంతి మాటల ప్రకారం, పరిచర్యలు అనేవి వాటితోనే అవి ముగిసిపోవు. అవి ఒక నిరంతర ప్రక్రియ. ఏదో నామమాత్రంగా పైపైన నిర్వహించే పనులుకావు. కేవలం అయిందని సరిపెట్టుకునేలా చేసేవి కాదు. ఈ ఒక్కటి చేస్తే చాలు అని భావించేందుకు వీల్లేదు. **సంఘం నిర్దిష్ట అవసరాలను ఎప్పటికప్పుడు గ్రహించి వాటిని తగిన విధంగా నెరవేర్చటమే పరిచర్య ఉద్దేశ్యం.** కనుక పరిచర్య అనేది సమాజం నుండే పురుడు పోసుకుంటుంది. సమాజంలో ఒక భాగమౌతుంది. సమాజం కోసమే తన ఉనికిని కలిగి ఉంటుంది. సమాజం ముందు నిలుస్తుంది. క్రీస్తు సేవగా సమాజంలో, సమాజం ఎదుట ఒక సజీవ సాక్ష్యంగా వెలుగొందుతుంది.

పరిచర్య పరమార్థ సారాంశం, పరమావధి సేవయే కాబట్టి పరిచర్య పలువిధాలుగా వివిధ సేవారూపాల్లో అందించవలసి ఉంటుంది. ప్రతి క్రైస్తవుడు బాప్తిస్మం ద్వారా ఈ సేవా బాధ్యతలతో పాటు అందుకు తగిన వర దీవెనలను కూడా పొందుతాడు. ఒక సంఘాన్ని నిర్మించి, క్రీస్తు దైవారాజ్యాన్ని విస్తరింపజేయడమే పరిచర్య ప్రధాన లక్ష్యం. ఆది శ్రీ సభ కాలం నుండే ఒక స్థానిక సంఘం అవసరాలను తీర్చేందుకే పరిచర్య ప్రారంభమైంది. **ప్రవచించుట, బోధించుట, నేర్పుట, స్వస్థపరుచుట, పలు భాషల్లో వివరించుట మొదలైనవన్నీ ఆత్మ వరాలే.** ఇవి సమాజ నిర్మాణంకోసం ఒసగబడుతున్నాయి.మరి ఈ నేపథ్యంలోనే, ఈ ఆలోచనా విధానంలోనే శ్రీ సభ పరిచర్యలు నిర్వహించబడుతున్నాయా? అన్నదే మనముందున్న ముఖ్యమైన ప్రశ్న.

**సామాన్య క్రైస్తవుల పరిచర్యలకు సహవాస సాంగత్యమే పునాది:** ద్వితీయ వాటికన్ మహాసభ బోధన ప్రకారం శ్రీ సభ ఒక దైవరహస్యం. ఈ పరమ రహస్యాన్ని అనుభవపూర్వకంగా ఆస్వాదించాలంటే శ్రీ సభలో సహవాస సాంగత్యం నెలకొనాలి. ప్రతి ఒక్కరిలో సహవాస జీవనంపై మక్కువ ఉండాలి. అందులోని మాధుర్యాన్ని ప్రతి ఒక్కరూ చవిచూడాలి. అది దినదిన ప్రవర్ధమానమై వర్ధిల్లాలి. అపుడే ఒక స్థానిక శ్రీ సభలో సమిష్టిభావన, ఉమ్మడి జీవితంలోని సహబాధ్యత వేళ్లూనుకుంటుంది. కనుక ఒక స్థానిక శ్రీ సభలోని వారందరు కలిసిమెలిసి ఒక ఉమ్మడి కుటుంబంగా జీవించడం, ఉమ్మడి బాధ్యతలను పంచుకోవడం, ఒకరికొకరు సహాయసహకారాలను ఇచ్చిపుచ్చుకోవడం ఎంతో అవసరం. **ఈ సహవాస సాంగత్యం అటు దేవునితోను, ఇటు ఇరుగు పొరుగువారితోను సవ్యంగా కొనసాగినప్పుడే శ్రీ సభలోని పరమ దైవ రహస్యం కనులముందు ఆవిష్కృతమౌతుంది.** ఈ సహవాస సాంగత్యం ప్రజల జీవితాన్ని, వారి పరిచర్యను ప్రభావితం చేయకుంటే అదొక అగోచర, అర్థంకాని, అదృశ్య భావనగానే మిగిలిపోతుంది. అందరం ఒకటే అనే భావన తప్పక వాస్తవరూపం దాల్చాలి. సహవాస జీవనం అనేది వాస్తవంగా జరగాలి.

ఆసియాఖండ పీఠాధిపతులు, ప్రతినిధుల సమాఖ్య (FABC) బోధన ప్రకారం క్రైస్తవులందరూ సమానమే. సహ బాధ్యత కలిగి, ఒకరిపై ఒకరు ఆధారపడి ఉండేవారే. **ఈ సహవాసం అనేది ఒక శూన్యంలో ఏర్పడదు. అది ప్రజలతో, ప్రజల మధ్యనే ఉంటుంది.** వారి ఉమ్మడి సాధన, కృషితోనే వారి పరిచర్య జరుగుతుంది. ఈ సహవాసానికి మూలం దేవుని ఆత్మ. ప్రతి ఒక్కరిలోనూ దేవుని ఆత్మయే పలు వరాలను నింపుతుంది. ఆ వరాలను వారు తమ సంఘంలోనే నెరవేర్చుతారు. తమ సంఘాన్ని బలపరుస్తారు. అభివృద్ధి బాటలో నడుపుతారు.


బాప్తిస్మం స్వీకరించిన ప్రతి విశ్వాసి క్రీస్తు ప్రేషితకార్యాన్ని నెరవేర్చేందుకు పిలవబడి, ఆత్మ వరాలతో నింపబడుతారు. కనుక కొందరిని మాత్రమే వరాలతో నింపబడిన వారనీ, మరికొందరిని ఎందుకూ పనికిరాని వారనీ నిర్ధారించకూడదు. ప్రతి ఒక్కరికీ సంఘంలో సమ గౌరవం, బాధ్యత, భాగస్వామ్యం ఉంటుంది. శ్రీ సభలో పరిచర్యల గురించి జరిగిన ఆసియా ఖండ పీఠాధిపతులు ప్రతినిధుల సమాఖ్య సమావేశంలో ఈ భావాన్ని గట్టిగా నొక్కి చెప్పడం జరిగింది. **క్రీస్తు ప్రేషితకార్యాలు సార్వత్రికమైనవి. స్వభావ సిద్ధంగా సర్వజనీనమైనవి. కొన్ని వర్గాలకుగానీ, కొందరు వ్యక్తులకుగానీ చెందినవికావు.** కొందరికే పరిమితమైనవి కూడా కాదు. అవి ప్రతి స్థానిక శ్రీ సభలోని స్థితిగతులు లేదా అవగాహననుబట్టి ప్రతి ఒక్కరికీ వర్తిస్తాయి. అందరి భుజాలపైన సమ బాధ్యత ఉంటుంది. ఎందుకంటే ఒక సంఘం మొత్తంగా క్రీస్తు ప్రేషిత కర్తవ్యాన్ని కలిగి ఉంటుంది. కనుక అందరూ తమ ప్రేషిత కార్యాలను, తమతమ పరిచర్యల ద్వారా నెరవేరుస్తారు. నారపోగులతో మెలిపెట్టిన బలమైన మోకు, తాడులా ఒక్కటిగా పనిచేస్తారు. అలా అందరూ ఒక్కటిగా క్రీస్తు ప్రేషిత సేవాకార్యాలను నెమరువేస్తూ సువార్త బోధనకు ప్రతినిధులు అవుతారు. క్రీస్తు సాక్షులుగా రూపొందుతారు. ప్రపంచంలో క్రీస్తు ప్రేషిత కార్యాన్ని కొనసాగిస్తారు.



**గాల్వాన్ లోయలో, చైనీయులు వాస్తవాధీన రేఖ దాటి, ముందుకు వచ్చారు. అది పసిగట్టిన భారత బలగాలు, వారిని సమర్థవంతంగా ఎదుర్కొని నిలువరించారు. అంతటితో ఆగక, ఎంత రెచ్చిపోయి, మన సైనికులను గాయపరుస్తున్న చైనీయులను గమనించి, తెలుగు సింహం కల్నల్ రాయుడు, ముందుకు దూకి, తన బలమైన చేతులతో, క్షణాల్లో నలుగురు చైనీయులను పై లోకాలకు పంపాడు. మిగతా వారు గజగజ వణికి వెనుదిరిగి పారిపోతుండగా వారి కమాండర్, తుపాకి గురిపెట్టి, "ఎక్కడికి వెళ్తున్నారు? వెనక్కి వెళ్ళేందుకు వీళ్ళేదు. ఎదురు బలగాలతో పోరాడక తప్పదు. వెళ్ళి వారిని హతమార్చండి" అని హుంకరించాడు.**

# పాదాభిషేకం!

**యం.డి. విన్సెంట్**
హైదరాబాద్
సెల్ : 9000895561



"సార్! ఆరడుగులున్న ఆ భారత సైనికులు, కండలు, తిరిగిన చేతులతో మనవారిని, తుక్కు తుక్కు చేస్తున్నారు. ఒక్కో ఇండియన్ "బాహుబలి"లా విజృంభిస్తుంటే ఎలా ఎదుర్కొమంటారు సార్! మనం, వెనుదిరిగి పోవడమే మంచిది" అని పొట్టి చైనీయులు గగ్గోలు పెట్టారు. "వీల్లేదు! మిషన్‌గన్‌కు బలవుతారా? వైరుల నెదుర్కుంటారా? తెల్చుకోండి" అని గర్జించగానే, ఒకేసారి 20 మంది, కల్నల్ రాయుడి మీద పడ్డారు. అరివీర భయంకర శూరత్వంతో, కల్నల్, చైనీయోధుల నొక్కొక్కరిని హతమారుస్తూ, విజయ విహారం చేస్తున్న తరుణంలో, ఓ చైనీయుడు, దొంగచాటు దెబ్బతీయగా, "జై భారత్!" అంటూ కల్నల్ రాయుడు నేలకొరిగాడు.

మన వీర జవానులు 20 మంది అమరులయ్యారు. కానీ చైనీయులు 40 నుండి 100 వరకు అసువులు బాశారని ప్రపంచ దేశాల అంచనా.

స్వగ్రామానికి చేరిన కల్నల్ రాయుని పార్థీవ దేహాన్ని అంతిమ సంస్కారం కోసం సకల రాచ మర్యాదలతో, ఊరేగింపుగా తీసుకెళ్తున్నారు. దారి పొడుగునా జనులు పూల వర్షం కురిపించి, 'వీర జవానుకు జేజేలు' 'అమర వీరునికి జోహర్లు' అంటూ ఆకాశం దద్దరిల్లేలా నినాదాలు చేస్తూ, అశ్రునయనాలతో, అంతిమ వీడ్కోలు పలుకుతున్నారు.

అమర జీవుడైన కల్నల్‌గారి పార్థీవ దేహం, దహన సంస్కార స్థలాన్ని చేరుకోగానే, గ్రామస్థులందరు పెద్ద సంఖ్యలో గుమికూడారు. వివిధ మతాలకు చెందిన పెద్దలు వస్తున్నారు. నిలువెత్తు తెల్లటంగీలు ధరించి, చేతిలో బైబిల్, స్లీవ స్వరూపాన్ని పట్టుకొని వస్తున్న క్రైస్తవ బోధకులను గమనించిన కొందరు బైరాగులు "అదిగో శవపూజ చేసే సన్యాసులు" అంటూ అవహేళన చేయడం విన్న అల్ఫోన్స్, వారితో "అంతిమ సంస్కారాలు ముగియగానే మీతో కాస్త మాట్లాడాలి. వెళ్ళిపోకండి" అని అభ్యర్థించాడు.

-- -- --

క్రైస్తవ మిషనరీలను చూసి, "శవపూజ చేసే సన్యాసులు" అని మీరెందుకన్నారో తెలుసుకోవచ్చా?" అని ప్రశ్నించాడు అల్ఫోన్స్.

"రెండు చెక్కల మీద ఓ శవాన్ని పడుకోబెట్టి, పూజించే వారిని ఇంకేమనాలి?" అని ఎదురు ప్రశ్నించారు బైరాగులు.

"మన దేశానికి ప్రాణమిచ్చిన కల్నల్‌గారిని, ఎంతో గౌరవంగా, 'వీర జవానుకు జేజేలు', 'అమర వీరునికి జోహార్లు' అని అన్నామేగాని, ఎక్కడా ఎవ్వరూ కల్నల్ శవానికి జేజేలు అని అనలేదే?! మన భారతదేశం కోసం ప్రాణాలిచ్చిన వీర జవానుకు ఇంత గొప్ప మర్యాదనిచ్చినపుడు, యావత్ప్రపంచ మానవాళిని రక్షించే క్రమంలో, తనను తాను అర్పించుకున్న ఏసు ప్రభువును అలాంటి వెటకారపు మాటలు అనడం భావ్యమా? ఏసు ప్రభువులవారు సజీవ దేవుడు. చీకట్లో వుంటే, ఎంతటి విలువైన వస్తువులైనా కంటికి కనబడవు. రండి! జ్ఞాన వెలుతురులో సత్యాన్వేషణ చేద్దాం. ఏసు మరణించిన గడియలో జరిగిన ప్రకృతి వైపరీత్యాలను ప్రత్యక్షంగా వీక్షించిన రోమను సైన్యాధిపతి అతని తోడి సైనికులు, "నిజముగా ఈయన దేవుని కుమారుడు" అని ప్రకటించారు. "ఏసు మృతులలో నుండి లేచాడని" సమాధి కావలివారు సాక్ష్యమిచ్చారు. పునరుత్థానుడైన క్రీస్తు, తన శిష్యులకగుపడినపుడు, "నా దేవా! నా ప్రభువా!" అంటూ తోమాస్ అనే శిష్యుడు భక్తి పరవశంతో ఆరాధించాడు. ఏసు ప్రభువు త్యాగానికి, ప్రేమకు, ప్రపంచమే సలాం కొట్టింది. ప్రపంచంలో అతి పెద్ద మతంగా ఉన్న క్రైస్తవ్యాన్ని అనుసరిస్తున్న ఏసు భక్తుల సంఖ్య 240 కోట్లు. అంటే ప్రపంచ జనాభాలో 33 శాతం, ఏసు ప్రభువుల వారిని సజీవ దేవునిగా అంగీకరించి అనుసరిస్తున్నారు. ఇంకా, బహిరంగంగాగాక, వ్యక్తిగతంగా ఏసే సత్య దేవుడని నమ్మి ఆరాధించేవారి సంఖ్య కోకొల్లలు. కాదంటారా?" అని అల్ఫోన్స్ ప్రశ్నించాడు.

"నువ్వు చెప్పేది బాగానే ఉంది కాని, మా గురువర్యులు నీ మాట ఒప్పుకోరుగా?" అన్నారు బైరాగులు.

"ఎందుకొప్పుకోరండి? గురువులకే గురువైన

(తరువాయి భాగం 25వ పేజీలో...)



# రక్షణ ప్రణాళికలో వాళ్ళిద్దరూ కలిసారు

**మే నెల రాకతో ప్రతి కతోలికుని యింట జపమాల జపించడం, కుటుంబ ప్రార్థనలు పెట్టించుకోవడం, ఆ తల్లి దీవెనలు పొందడం ఎంతో అదృష్టంగా భావిస్తాం. మే నెలలో మరియతల్లి పండుగలు మూడింటిని తల్లి శ్రీ సభ కొనియాడుతోంది.**

**- సిస్టర్ విజయశాంతి**
సాక్రేడ్ హార్ట్ కాన్వెంట్, గుడివాడ.
సెల్ : 7799236063

- మే 13వ తేదీ పరిశుద్ధ ఫాతిమామాత పండుగ
- మే నెల 24వ తేదీ క్రైస్తవుల సహాయమాత పండుగ
- మే నెల 31వ తేదీ మరియతల్లి పునీత ఎలిజబేతమ్మను సందర్శించిన పండుగ.

మే నెల చివరి రోజు 'గోప్య' పండుగ. ఈ పండుగను మనం జపములలో సంతోష దేవ రహాస్యంలో రెండవ గుర్తు "మరియమ్మ పునీత ఎలిజబేతమ్మను సందర్శించుటను గురించి ధ్యానించుదాం" అనే అంశాన్ని ధ్యానిస్తూ ఆ మరియతల్లి మన ఇంటిని కూడా సందర్శించి మనతో జీవిస్తూ మన కుటుంబంలో ఉన్న లోటుపాటులను తీసివేయమని మనవి చేస్తాం.

ఈ పండుగలో ఇద్దరు వ్యక్తుల పేర్లు వింటాం. వారు పునీత ఎలిజబేతమ్మ, పరిశుద్ధ మరియమ్మ. **ఎలిజబేతమ్మ అనగా "దేవుడే ప్రమాణము" అని అర్థం. మరియ అనగా "సముద్రపు నక్షత్రం" అని గ్రీకు భాషలో, "యజమానురాలు" అని హీబ్రు భాషలో అర్థాలు ఉన్నాయి.** ఎలిజబేతమ్మ యాజకుడైన జకర్యా భార్య. ఈమె అహరోను యాజకవంశంలో ఒకరు. నీతిమంతురాలు. దైవభక్తి, దైవభయం కలిగి దేవుని ఆజ్ఞలను విధిగా పాటించిన దైవజనురాలు (లూకా 1:5-6). ఈమె యేసు తల్లి మరియకు బంధువురాలు (లూకా 1:36). బప్తిస్త యోహాను తల్లి. తండ్రి ఇంట, భర్త ఇంట యాజకత్వపు విలువ తెలిసిన స్త్రీ. అయితే ఈమెకు ఒకప్రక్క సంతానం లేదు అనే సమస్య (లూకా 1:7). మరోప్రక్క భార్యాభర్తలు ఇద్దరు కడువృద్ధులు. సంతానం లేదనే చింత ఉన్నప్పటికీ దేవునిపై అపారమైన విశ్వాసం కలిగి ప్రార్థించేది. గొడ్రాలనే నిందను సమాజం నుండి తీసివేస్తాడు అనే ఆశతో దేవుని నమ్మింది. ఈ సమస్య ఎలిజబేతమ్మను ఏ విధమైన ఆత్మీయ క్షీణతకు దిగజారనీలేదు. విశ్వాసంతో ప్రభువు వైపు చూస్తూ, దేవునిపై భారంవేసి నెరవేర్చుకుంది.

**సంతానం లేదు అని కుమిలిపోతూ సంతానం ప్రసాదించమని దేవుని ఓపికతో ప్రార్థించింది.** "పుత్రులు ప్రభువు ఇచ్చు వరం. తనయులు దేవుని బహుమానం (కీర్తన 127:3) అని నమ్మింది. భర్తను నిరాశపరచక యాజకధర్మాన్ని ప్రోత్సహించింది. నిరీక్షణతో ప్రార్థించింది. పట్టువీడని ప్రార్థనాపరురాలు (లూకా 1:13). జకర్యా దూపం వేసే సమయంలో దేవదూత ప్రత్యక్షమై శుభవర్తమానం చెప్పింది. "నీ ప్రార్థన ఆలకించబడింది. నీ భార్య ఎలిజబెతమ్మ ఒక కుమారుని కనును. అతనికి "యోహాను" అని పేరు పెట్టుము అని వాగ్దానం చేసాడు దేవుడు. ఈ వార్త విని ఎలిజబెతమ్మ సంతోషంతో దేవుని స్తుతించింది. "నేటికి ప్రభువు నన్ను కరుణించెను. ప్రజల మధ్య నా నిందను పోగొట్టెను" (లూకా 1:25) అని పలికింది. **వృద్ధాప్యంలో అదో వింతైన అనుభవం. ఎందుకంటే అసాధ్యమైన దానిని దేవుడు తన జీవితంలో సాధ్యమని నిరూపించారు.** మూగవాడై తొమ్మిది నెలలు ఉండడం ఆమె భర్త అపనమ్మకానికి చిహ్నం.

దేవుని ప్రణాళికలో ఆరు నెలలు గడిచిన తర్వాత అదే గాబ్రియేలు దేవదూత దేవుని శుభవర్తమానం నజరేతు గ్రామానికి చేరింది. అక్కడ వడ్రంగి వృత్తి చేస్తున్న యోసేపుకు కన్య మరియకు నిశ్చితార్థం జరిగింది. కాని రక్షకుడైన క్రీస్తును ఈ లోకానికి తీసుకురావడానికి కన్య మరియతో దేవునికి పనిబడింది. మధ్యవర్తిగా

గాబ్రియేలు దేవదూతను పంపి విషయం వెల్లడించారు (లూకా 1:26-38). ఆ కన్య దేవుని చిత్తానికి తలొగ్గేలా ఆమెతో సంభాషించి, అడిగిన ప్రశ్నలకు జవాబిస్తూ అనుమానాలను తీర్చింది. "అనుగ్రహ పరిపూర్ణురాలా! అని కన్యను దూత పొగిడింది. దేవుని అనుగ్రహాలు, వరాలు దండిగా పవిత్రాత్మ ద్వారా కన్యకు అనుగ్రహించబడినాయి. దూత వర్తమానానికి "ఇదిగో నేను ప్రభు దాసురాలను" అని తలొగ్గి, **దేవదూత సూచన మేరకు తన చుట్టమైన ఎలిజబెతమ్మను చూడ దానికి యూదయసీమ కొండ ప్రాంతానికి బయలుదేరిన ధీరవనిత మరియ. ఒంటరిగా సాహసంచేసి యాజకుడైన జకర్యా ఇంటికి చేరింది.** ఆమె అడుగుల చప్పుడు, పవిత్రాత్మ వెలుగు కిరణాలు ఆ ఇంటిని సోకిన వెంటనే ఎలిజబెతమ్మ ఆత్మపూరితురాలై ఎలుగెత్తి స్తుతించింది. **"నా ప్రభువు తల్లి నా యొద్దకు వచ్చుటకు నేను ఎంత ధన్యురాలిని"** ఈ స్తుతి వచనంతో వారిరువురి గర్భంలోని (పిండ దశ) శిశువులు ఎగిరి గంతులు వేసి బంధుత్వాన్ని, ఆత్మీయ సంగమాన్ని, దేవునిరక్షణ కార్యాన్ని నిర్వర్తించుటకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. తల్లి గర్భంలోనే గర్భస్థ శిశువుల కలయికతో ఎలిజబెతమ్మ, కన్య మరియల ఆనందం ఎంత అందమో! కనుకనే ఇద్దరు స్త్రీమూర్తులు గౌరవ వందనానికి పాత్రులు:

– ఇద్దరు దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికి ఇద్దరు కుమారులను దేవుని రక్షణ ప్రణాళిక ప్రకారం పెంచారు.

– ఒకరు వృద్ధురాలైన గొడ్రాలికి పుడితే, మరొకరు కన్య గర్భమున జన్మించారు.

– ఒకరు పుట్టతేనెను త్రాగితే, మరొకరు తన రక్తాన్ని ధారపోశారు.

– ఒకరు మిడతలు భుజిస్తే, మరొకరు పాపులతో సుంకరులతో కలిసి తిన్నారు.

– ఒకరు జంతు చర్మాన్ని ధరిస్తే, మరొకరు వస్త్రహీనులైనారు.

– ఒకరు ఎడారిలో ఎలుగెత్తే స్వరమైతే, మరొకరు లోకానికి నేనే వెలుగును అన్నారు.

– ఒకరు హృదయ పరివర్తనకు సందేశమిస్తే, మరొకరు లోక రక్షణకోసం సిలువలో మరణం పొందారు.

– ఇద్దరు తల్లుల త్యాగఫలమే ఈ రెండు పిండాల కలయిక.

– ఈ ఇద్దరు మనుష్యుల రక్తతర్పణమే ఈ లోక రక్షణ.

ఎలిజబేతమ్మకు ప్రసవకాలం వచ్చినపుడు తన కుమారునికి జన్మ నిచ్చింది. **పేరుపెట్టునపుడు తండ్రిని అనుసరించి జకర్యా అనే సంప్రదాయానికి వ్యతిరేకంగా బంధువులను ఎదిరించి దేవుడిచ్చిన వాగ్దానం ప్రకారం "యోహాను" అని నామకరణం చేసిన సాహసవంతురాలు.** దృఢ సంకల్పం కలది. వాగ్దాన పుత్రునికి వాగ్దానపు పేరే ఖాయపరిచిన నిష్ఠ కలిగిన స్త్రీమూర్తి ఎలిజబెతమ్మ.

ఈ ఇద్దరు స్త్రీమూర్తుల నుండి ఈ పండుగరోజు మనం నేర్చుకోవలసిన సుగుణాలు లేదా జీవితసత్యాలు ఏవంటే:

– ఇద్దరు స్త్రీలే కాని త్యాగమూర్తులు.

– ఇద్దరు బలహీనులే కాని బలమైన సైన్యాన్ని తయారుచేయించారు.

– ఇద్దరు యూదయ స్త్రీలు కాని వారి కుమారులను రక్తసాక్షిగా, రక్షకుడిగా బలి అర్పించారు.

– ఇద్దరు చుట్టాలే కాని బంధాలలో దేవుని చిత్తం వెతికి నెరవేర్చారు.

– సమస్యలో ఆత్మీయ క్షీణతకు గురికాలేదు.

– సమస్యలో ఓర్పుతో ప్రార్థించి, విశ్వాసంలో పయనించారు.

– సమస్య వైపు పరుగెత్తక దేవుని వైపు చూచారు.

– సమస్యలో బంధువులను ఎదిరించి దేవుని వాగ్దానం నెరవేర్చారు.

– సమస్యలో దేవుని ఆజ్ఞల చొప్పున నడిచారు.

– సమస్యలో దేవుని స్తుతించి పరిశుద్ధాత్మ నడిపింపు పొందారు.

మనం కూడా వీరిద్దరివలె జీవిద్దాం. పొరుగువారిలో దేవుని దర్శిద్దాం. దేవుని చట్టప్రకారం నడుద్దాం ఇతరులను నడిపిద్దాం.

## విన్నపము

ప్రియమైన భారతమిత్రం పోషకులు, చందాదారులు, ప్రకటనకర్తలు, విశ్వాసులు, అభిమాన పాఠకులకు శుభములు. కర్కశ కరోనా వ్యాధి నుండి మనందరిని కాపాడుతున్న దేవదేవునికి కృతజ్ఞతలు. ఈ సందర్భంగా తెలియజేయునది ఏమంటే లాక్‌డౌన్ కారణంగా మన భారతమిత్రం పత్రిక తీవ్రంగా నష్టపోయింది. కొత్త చందాదారులు ముందుకు రాలేదు. పాతవారు రెన్యువల్ చేయించుకోలేదు. ప్రకటనల ద్వారా ఏప్రిల్, మే, జూన్ నెలలో సమకూరే ఆదాయం పూర్తిగా ఆగిపోయింది. దీనివల్ల భారతమిత్రం పత్రిక ప్రచురణ కష్టంగా మారింది. ఈ కష్టకాలంలో ఆదుకొని ఆర్థిక సహాయం చేయగలరని దయార్థ్ర హృదయులందరిని కోరుతున్నాము. మీ సహాయం మన క్రైస్తవ విశ్వాస వికాసానికి ఎంతో విలువైనది.

<u>మీ విరాళాలు పంపవలసిన చిరునామా :</u>
ఎడిటర్, భారతమిత్రం, టి.సి.ఐ.సి., సెక్రటేరియేట్,
2/3, సిక్ విలేజ్, మనోవికాస్ నగర్ (ఎస్.ఓ.),
సికింద్రాబాద్ – 500 009, తెలంగాణ

BHARATHMITHRAM SOCIETY
A/c no. 0246053000007220
IFSC Code : SIBL0000246
Secunderabad. South Indian Bank

(23వ పేజీ తరువాయి...)
భారతదేశపు రెండవ ప్రెసిడెంట్ డా॥ సర్వేపల్లి రాధాకృష్ణగారు "అత్యున్నతమైన గురువంటే ఏసు క్రీస్తే! ఆయన కులగోడలను కూల్చాడు. స్త్రీల గౌరవాన్ని పెంచాడు. పాపులుగా, నీచులుగా వెలివేయబడిన వారిని, ప్రేమతో ఆదరించిన ప్రజ్ఞాశాలి, మహోన్నతుడైన సద్గురువు" అంటూ ఏసు ప్రభువును గుండెలకత్తుకున్నారు. శ్రీ రామకృష్ణ పరమహంసగారు, "ఏసు మానవతారమెత్తిన సత్య దేవుడని' నమ్మి భళా! అంటూ బాహాటంగా ప్రకటించారు.

'నజరేయుడైన ఏసు జీవించిన కాలంలో నేను కూడ పాలస్తీనాలో నివసించి ఉంటే ఆయన పాదాలను, నా కన్నీటితో కాదు, నా రక్తంతో కడిగే వాణ్ణి" అంటూ మహాజ్ఞాన సంపన్నుడైన స్వామి వివేకానందగారు పులికిత హృదయంతో మురిపెంగా చెబుతూ ఏసు ప్రతిష్ఠను ఆకాశానికి ఎత్తేశారు. ఆ విధంగా జగత్ప్రసిద్ధ పెద్దలు, పూజ్యులు సెలవిచ్చిన మాటలను గౌరవించి, మీ అలక్ష్యపు మాటలను వెనక్కు తీసుకొని ముక్తిదాత, నవజీవన ప్రదాత ఏసు పాదాభిషేకం చేసి ధన్యులు కండి" అంటూ అల్ఫోన్స్ వారికి చక్కటి సిలువను బహుకరించాడు.

"ఏసు క్రీస్తు సాధారణ మనిషి కాదు. ఆయనకు సాటి ఎవరూ లేరు. అలెగ్జాండర్, సీజర్, నేను భూలోక సామ్రాజ్యాలు స్థాపించాం కాని ఏసు ప్రేమ మీదనే తన విశ్వ సామ్రాజ్యాన్ని ప్రతిష్టించాడు"
– (నెపోలియన్ బోన పార్టీ)

# ఉదయ సప్తకం- ప్రాంజలి

(గత సంచిక తరువాయి)

ఉభయ భాషా ప్రవీణ
డా॥ దేవదాసు బెర్నార్డు రాజు
కావలి
సెల్ : 9866755024



**తే : దారి తప్పి నడచు పిచ్చి వారి నెల్ల**
**యెదకు హత్తుకోగల తీపి మృదుల మతివి**
**తప్పి పోవు గొఱ్ఱెల నింటి కప్పగించు**
**నిత్య కారుణ్య మూర్తివి నీవు కావె ! 1.61**

**భావం :** దారి తప్పిన వారికి, నీవే ఆది దేవుడ వన్న అసలు సత్యం తెలిపి, వారిని నీ చెంతకు చేర్చుకొనే ప్రేమ మూర్తివి. తండ్రీ! తప్పి పోయిన గొర్రెపిల్లను లోయలోనుండైనా పైకి తీసే కరుణా మూర్తివి నీవనే సత్యం మాకు తెలియనిదా? 1.61 /100

**తే : పిలుచుచో పల్కి కనిపించ గలవు మాకు**
**అందరిని తాకగల్గు చున్నట్టి నిన్ను**
**ఛాందసము లోన బంధించి సంబర పడ,**
**వెలికి రావో విశాలమౌ విశ్వమునకు? 1.62**

**భావం :** పిలిస్తే చాలు అందరికీ సులభం గానే అందుబాటులో ఉంటావే! అటువంటి నిన్ను ఇంకా ఈ ఛందస్సు పద్యాల్లో చాటు మాటుగా దాస్తూ చూపించ వలసిన పనేమిటి? ఎంతగా చాటుగా దాచినా, వెలికి రాలేవో? (భావాన్ని ఎంత వ్యంగ్యంగా మరుగు పరిస్తే అంతగా సౌం దర్యం రావడం కవిత్వంలో ధ్వని లక్షణం కదా)

**మ : ధ్వనియించం భవ దర్థ శబ్దతతి యీధాత్రీ ప్రబోధాళిలో**
**అనిపించు న్నిట నింకనూ తిరుగు చున్నా వంచు మామధ్యలో**
**జనియించు న్నవ జీవమాధురులు తేజాబ్దు లుప్పొంగగా**
**కనిపించు న్మగురయ్య లచ్చెరువు లౌగా ముల్ – నిఘా – యించగా 1. 63**

**భావం :** తండ్రీ నీ భావాలు, నీ యర్థాలూ ఈ లోకంలోని వాక్య బోధకుల్లో ప్రతిధ్వనిస్తూ ఉండగా, నాకు నీవు ఇంకా మా చుట్టూనే వున్నావనిపిస్తుంది. నాలో క్రొంగ్రొత్త కాంతులు ప్రవహిస్తూనే ఉంటాయి కూడా.

నాకు నీ వున్నావని అనిపించడమే కాదు. త్రియేక దేవుడూ కనిపిస్తాడు కూడా!

నిజమా? అబద్ధమా? ఔనా? కాదా? అనే భావాలకు సమీక్షలు, విమర్శలు, పరిశోధనలు నా భావంపై నిఘా కాపలాగా ఉంటే ఉండనీయండి. (నా విశ్వాసం నాకు ఉండనే ఉంది కదా).

**కం : దైనందిన రథమే నిన్**
**ధ్యానించక ముందుకు నడయాడునె నీ– వ**
**ద్దానికి సారథి వని మా**
**మౌన మనసులే జపమయి మరిమరి తలచున్ 1.64**

**భావం :** మేము ప్రతిరోజూ చేసే పనులను మీరే ముందుండి నడిపిస్తారని మిమ్ము తలంచకుండా యే పనీ చేయము.అందుకే మా మనసులు జపములై మారిపోయి నిన్ను క్షణ క్షణమూ తలుస్తూ ఉంటాయి.

**కం: ప్రతిరోజూ యేదేదో**
**జతచేరును పండుగౌచు చక్రాకృతిలో**
**నతినుతికి నీవె మూలపు**
**పతివై కొనగా ఫలములు పావనపితవై 1.65**

**భావం :** మాకు మార్గదర్శకం కావడానికో యేమో, ప్రతిరోజూ యేదో ఓ పండుగ, ఎవరిదో ఒక మహా పునీతుని పుట్టిన రోజు కాలచక్రాన్ని అలంకరిస్తూనే ఉంటాయి. వాటన్నిటి మూలం నీవేగా తండ్రీ! (ప్రతి రోజూ ఏదో పునీతుని స్మరించడం ఉత్తేజితులు కావడం)

**కం: మా మా గుడుల న్కాయుచు**
**క్షేమంకరముగ నిలిపెడు శ్రీపాలకులీ**
**భూమీశులనే మించెడు**
**స్వాము లనగ నేలుచుంద్రు సతతము కనుచున్ 1.66**

**భావం :** మా దేవాలయాలను కలకాలం కాచికాపాడడానికై పాలక పునీతులుగా ఒక్కొక్క ఊరిలో ఒక్కొక్క పునీతుడు రక్షిస్తూ ఉంటాడని మా నమ్మకం. వారు మమ్మేలే రాజుల్లా మాకంటికి కనిపిస్తూ ఉంటారు. ఎంతటి భాగ్యమో కదా అది!

**కం: మమతా భావన నిలుచునొ**
**సమతా సేవలె అలుకునొ సత్యపథ మదే**
**రమణీయమ్మే మెలగునొ**
**తమకమున న్నిను కొలవగ తథ్య మ్మెదలో 1.67**

**భావం :** నిన్ను తలిస్తే కలిస్తే, కొలిస్తే చాలు ప్రేమ భావం, సేవా భావం సత్య భావం మొదలైన వన్నీ ఎంతో రమణీయంగా మనసులో మెదులుతూ ఉంటాయి.

**కం: ఎంతటి కష్టము చుట్టిన**
**నెంతటి దుఃఖము రగిలిన నెంతగ మదియే**
**చింతిలినన్ క్షుత్ మండిన**
**నంతయు చల్లారదె భవ దంతిక మందున్ 68**

**భావం :** ఎంతటి కష్టమైనా చుట్టుముట్టనీ, మరెంతటి దుఃఖమైనా ఉప్పొంగనీ, ఇంకెంతటి ఆకలైనా రగలనీ, నీ చెంతనే కనుక ఉంటే అన్నీ మటు మాయమై పోతాయి.

**కం: కాల ఘనాఘన భీకర**
**మాలిక లన్నిప్పురవ్వమంత్రించెడునో**
**వేలకు వేల్పసిడి మెరుగు**
**కీలించెనొ దివి నిను తిలకించి నుతించెన్ 69**

నల్లటి భయంకర మేఘాల గుంపులపై ఎఱ్ఱటి నిప్పు కణికలు పడ్డాయో లేక బంగరు రవ్వల మెరుగులు చిక్కుకున్నాయేమోఅన్నట్టుగా అవి నిన్ను చూస్తూ సంస్తుతిస్తున్నాయి.

**కం: గిరు లెల్లం గరిగిననూ**
**ఝురు లాగిననూ జలధులు జారుచు నింకన్**
**తరులే కూలిననూ సు**
**స్థిరమై నీవ్వారతము సిరిసిరి కాదో 70**

**భావం :** కొండలన్నీ కరిగితే, కరగొచ్చు గాక, సెలయేర్లన్నీ ఆగితే ఆగొచ్చు గాక ,సముద్రాలు ఇంకిపోతే ఇంకిపోవొచ్చు గాక, చెట్లన్నీ కూలితే కూలొచ్చు గాక నీ వాక్కు మాత్రం స్థిరంగా చిర కాలమూ ఉంటుందట ! నిరంతరమూ కళ కళ లాడుతుందట.

# అశ్రు నివాళి



## కీ.శే. శ్రీ ఆచార్య తిరుమలరెడ్డి రాయపరెడ్డి గారు

జననం: 04-09-1949 మరణం: 28-04-2020

దైవభక్తితో విద్యాబుద్ధులలో ప్రావీణ్యత పొంది వ్యవసాయం మీద మక్కువతో వ్యవసాయ శాస్త్రంలో డాక్టరేటు సాధించి వ్యవసాయ క్షేత్రంలో విలువైన సేవలందించిన కృషీవలుడు.

**నిత్య సత్యాన్వేషీ! మిమ్ము ఎలా మరువగలం!!**

తిరుమలరెడ్డి కుటుంబానికి ముద్దుబిడ్డవు. అమ్మమ్మ తాతయ్య తిరుమలరెడ్డి తోమస్ రెడ్డి, ఇన్యాసమ్మల లాలానలో దైవభక్తిలో ఎదిగిన కతోలిక విశ్వాసివి. క్రమశిక్షణే మీ అభ్యుదయం. పొరుగువాని మంచి కోరడం, బీదసాదలకు చేయూతనీయడమే మీ ఉదార స్వభావం. వ్యవసాయంపై మక్కువతో ఆంధ్ర, తెలంగాణ అంతటా పర్యటించి విద్య వైజ్ఞానిక విషయాలను పంచిపెట్టిన విజ్ఞానజ్యోతివి. వ్యవసాయరంగంలో అనేక సేవాకార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యతనిచ్చిన మీ ధన్యత గొప్పది. పునీత మదర్ తెరెసాను దర్శించారు. సేవాభావమే దైవప్రేమని జీవితాంతం ఆచరించారు. కతోలిక దేవాలయం చుట్టూ మూడు ప్రదక్షిణాలు చేస్తే దేవుని అపారమైన దీవెనలు లభిస్తాయని నమ్మారు, కొత్త సంప్రదాయాన్ని నేటి తరానికి పరిచయం చేసారు. అనేక పుస్తకాలు రచించారు, అనువదించారు, ప్రపంచానికి అందించారు. జపమాలను మెడలో నుంచి తీయని మరియతల్లి భక్తులు మీరు.

**తుదిశ్వాస వరకు కతోలిక శ్రీ సభ విధేయునిగా, ఆదర్శ భర్తగా, మంచి తండ్రిగా, ప్రేమగల తాతగా పరిపూర్ణ జీవితాన్ని గడిపి 72వ యేట ప్రభు పిలుపందుకొని పరమపురికి పయనమయ్యారు. ఇహలోక యాత్రలో ధన్యత పొందిన మీ ఆత్మ పరలోకంలో సేదతీరాలని, మాకోసం ప్రభువైన యేసుక్రీస్తును వేడుకోవాలని ప్రార్థిస్తూ...**



భార్య : **శ్రీమతి తిరుమలరెడ్డి సుందరి**

**కుమారుడు - కోడలు; కుమార్తె - అల్లుడు; మనుమలు, మనుమరాండ్రు** మరియు **తిరుమలరెడ్డి కుటుంబ సభ్యులు**

డాన్ బోస్కో పుణ్యక్షేత్రం, బండ్లగూడ జాగీర్, హైద్రాబాద్. మొబైల్: 94402 06684

Date of Publication 10th & 25th of every month
RNI TELTEL/2019/77514 No.: IR/HQ/SD/522/2019-21 BHARATA MITRAM TELUGU FORTNIGHTLY (1-15 & 16-30) - POSTING DATES 12th, 13th & 27th, 28th

# దైవసేవ కొరకు జేసుసభ ఆహ్వానం

(2021-22)



**పునీత ఇగ్నేషియస్ లొయోలా**
జేసుసభ స్థాపకులు





**పునీత ఫ్రాన్సిస్ శౌరివారు**

**పోప్ ఫ్రాన్సిస్,** ప్రథమ జేసుసభ పోపు

ఈ లోక వ్యామోహాలలో జీవించాలనుకొన్న ఇనిగోగారు పునీత లొయోలాపురి ఇన్యాశివారిగా మారి జేసుసభ స్థాపకునిగా "సర్వం సర్వేశ్వరుని సర్వోన్నతికై" జీవించారు. "లోకమంతా సంపాదించి ఆత్మను కోల్పోయిన ప్రయోజనమేమి" అనే వాక్యం ఆనాడు ఒక కళాశాల అధ్యాపకునిగా ఉన్న శౌరివారిని పునీత శౌరివారిగా మార్చింది. వీరి కోవలో ప్రభుని అనుసరిస్తూ ఎందరో జేసుసభ గురువులు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో విద్య, సాంఘిక, ఆధ్యాత్మిక, సామజిక రంగాలలో పనిచేస్తున్నారు. ఈ ఆధునిక యుగంలో 112 దేశాలలో 15,306 సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద సభగా ఎదిగి అపూర్వ సేవలందిస్తున్న జేసుసభలో చేరడానికి ఆసక్తిగల 10వ తరగతి లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హతలతో చదువు పూర్తిచేసిన యువకులను జేసుసభ పిలుస్తోంది. "మీరు సకలజాతి జనులకు సువార్తను బోధింపుడు" అని క్రీస్తు ప్రభువు తన శిశ్యులను కోరారు. ఈ వాక్యాన్ని ఆలకించి క్రీస్తును అనుసరించడానికి క్రీస్తు సువార్తా పరిచర్యలో పాలుపంచుకొని జేసుసభలో చేరడానికి ఆసక్తిగల వారికి మా హృదయపూర్వక ఆహ్వానం.

## ఉదారత కోసం పునీత లొయోలాపురి ఇన్యాశివారి ప్రార్థన

**"ఓ దేవా! వెల చూడకుండా ఇచ్చినందుకు, గాయాలను లెక్కించకుండా పోరాడేందుకు, విశ్రాంతినాశించకుండా శ్రమించేందుకు, ప్రతిఫలాపేక్షలేకుండా పనిచేసేందుకు, నీ చిత్తం నెరవేర్చుచున్నానన్న జ్ఞానం తప్ప మరి దేన్నీ నేను కోరకుండా ఉండేందుకు ఉదారంగా ఉండడం నాకు నేర్పించు. నిన్ను సేవించవలసిన తీరు నాకు ఎరిగించు స్వామీ"** ఆమెన్

గమనిక: కరోనా దృష్ట్యా ఈ సంవత్సరం దైవపిలుపు సమావేశాలు (Vocation Camp) కొంచెం ఆలస్యంగా నిర్వహించబడును.

సంప్రదించవలసిన చిరునామా :
**ఫాదర్ విద్యాసాగర్ యస్.జె.** (ఆంధ్ర జేసుసభ వొకేషన్ ప్రమోటర్)
సెల్: 89198 21562; ఇ-మెయిల్: vidhyasagarsj@gmail.com, ఆనందజ్యోతి, నాగార్జుననగర్ - 522 510, గుంటూరు జిల్లా
www.facebook.com/andhrajesuitvocationpromoter

Edited, Printed & Published for Bharata Mithram TCBC Secretariat, 2/3, Sikh Village, Secunderabad, Hyderbad - 500009, Telangana